Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 314 పేజీలు 8 వెల : 5 గురువారం 14 మే 2026






## రైతులపైనే దాడి చేస్తారా

**ఎమ్మెల్యే ధూళిపాళ్లపై అంబటి మండిపాటు**

గుంటూరు: ఏపీలో రైతులపై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర దౌర్జన్యం చేస్తారా అని మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. మామిళ్లపల్లి ఘటనపై సిగ్గుపడాలి అని ఘాటు విమర్శలు చేశారు. రైతుల కాలి ధూళికి ధూళిపాళ్ల ఓడిపోతారు. ప్రశ్నించే వారిపైనే దాడులు చేస్తారా అంటూ మండిపడ్డారు.

మొక్కజొన్న రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ చలో మామిళ్లపల్లి పిలుపు నిలిచింది. మొక్కజొన్న రైతులపై దాడి, అక్రమ కేసులపై నిరసనలు చేపట్టింది. ఇందులో భాగంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ..'ఎమ్మెల్యే ధూళిపాళ్ల రైతుల గోడౌన్లు, ఇళ్లపై దాడులు చేయిస్తున్నారు. రైతులు దాచుకున్న

మొక్కజొన్న గోడౌన్‌పై ధూళ్ళిపాళ్ల అనుచరులు దాడిచేశారు. మామిళ్ళపల్లి దాడితో సిగ్గు పడాలి. ప్రశ్నించే వారే లేరని దాడులు చేస్తున్నారా?. మా కుటుంబంపై, మా కులంపై, మా పార్టీపై కక్ష కట్టారా?. ఎన్నాళ్ళు మీకు అధికారం ఉంటుంది. అంతకుముందు ఓడిపోలేదా?. అన్నారు. మూడేళ్ళ ముందే చెబుతాను రాసుకోండి.. వచ్చే ఎన్నికల్లో ధూళ్ళిపాళ్ల నరేంద్ర ఓడిపోవడం ఖాయం. గోడౌన్లు, ఇళ్లు, కార్యాలయాలపై దాడి చేస్తున్నారు. గుంటూరు ఐజి త్రిపాఠీ ఖాకీ డ్రెస్స్ వేసుకోవడం లేదు. పచ్చ డ్రెస్స్ వేసుకుంటున్నాడు. లోకేష్, పెమ్మసాని ఏది చెబితే అది చేస్తున్నాడు. అదే చేస్తున్నాడు. మీరు భయపడితే వంగవీటి మోహన్ రంగాలా చంపేస్తారు. తప్పు చేస్తే ఎంత పెద్ద అధికారి అయినా చట్ట ప్రకారం బట్టలు ఊడదీస్తాం. త్రిపాఠికి చెబుతున్నా.. తప్పుడు కేసు తొలగించాలి. అరెస్ట్ చేస్తే జైలు కొచ్చి కూర్చొంటాం. గోడౌన్‌లో ఉన్న మొక్కజొన్న వెంటనే రిలీజ్ చేయాలి' అని డిమాండ్ చేశారు.

## ఎపిలో డిజిటల్ కనెక్టివిటీ పెంపు



**బిఎస్ఎస్‌ఎల్‌తో ఎపి ప్రభుత్వం ఒప్పందం**

**హైస్పీడ్ ఇంటర్‌నెట్ సరఫరాతో గ్రామాలకు మేలు**

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ కనెక్టివిటీని మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. భారత్ నెట్ అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, బీఎస్ఎన్ఎల్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య చారిత్రాత్మక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను విస్తరించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధమయ్యాయి.భారత్‌నెట్ ఒప్పందంతో రాష్ట్రంలో డిజిటల్ విప్లవానికి మరింత వేగం రానుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అసమానతలను తగ్గించడం, ప్రజలకు సాంకేతిక సేవలను అందుబాటులోకి తేవడం, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించడం వంటి లక్ష్యాలకు ఈ ప్రాజెక్టు తోడ్పడనుంది. డిజిటల్ ఇండియా లక్ష్యాలను గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడంలో ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలవనుందని అధికారులు భావిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో 'సవరించిన భారత్‌నెట్ ప్రోగ్రామ్' అమలుకు కేంద్ర ప్రభుత్వం రూ.2,432 కోట్ల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ నిధులు డిజిటల్ భారత్ నిధి ద్వారా విడుదల కానున్నాయి. ఈ ప్రాజెక్టు అమలుతో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు వేగవంతం కావడంతో పాటు టెలికాం మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయి. కొత్త ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని 13,426 గ్రామ పంచాయతీలకు హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందించనున్నారు. ÷బైర్ నెట్ నెట్‌వర్క్‌ను విస్తరించడం ద్వారా గ్రామీణ ప్రజలకు వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రత్యేకంగా విద్య, వైద్యం, వ్యవసాయం, ఈ-గవర్నెన్స్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో మరింత సులభంగా చేరేలా ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న 3,942 గ్రామాలకు 'ఆన్-డిమాండ్ కనెక్టివిటీ' సౌకర్యం కల్పించనున్నారు. ఇప్పటివరకు సరైన నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో కూడా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ప్రత్యేక సాంకేతిక వ్యవస్థలను వినియోగించ నున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవలు మరింత వేగంగా విస్తరించే అవకాశం ఏర్పడింది. ఈ ప్రాజెక్టు అమల్లో కేంద్ర టెలికాం శాఖ, బీఎస్ఎన్ఎల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ÷బైర్ నెట్ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌బ్యాండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ కీలక

భాగస్వామ్య సంస్థలుగా వ్యవహరించనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన డిజిటల్ సేవలను అందించడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యంగా ఉంది. భారత్‌నెట్ ప్రాజెక్టు అమలుతో గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ విద్యా సేవలు మరింత విస్తరించనున్నాయి. విద్యార్థులు డిజిటల్ క్లాసులు, ఆన్‌లైన్ కోర్సులు, వర్చువల్ లెర్నింగ్ సదుపాయాలను సులభంగా వినియోగించుకోగలరు. అలాగే గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో టెలీమెడిసిన్ సేవలు అందుబాటులోకి రావడంతో వైద్య సేవలు కూడా మరింత చేరువ కానున్నాయి. ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందేందుకు ఈ-గవర్నెన్స్ వ్యవస్థకు కూడా ఇది బలాన్నిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికే అమలులో ఉన్న ÷బైర్ నెట్ సేవలను మరింత బలోపేతం చేయడమే ఈ కొత్త ఒప్పందం ముఖ్య ఉద్దేశంగా ఉంది. ప్రతి గ్రామానికి మాత్రమే కాకుండా ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ చేరేలా దశలవారీగా చర్యలు చేపట్టనున్నారు.



# పొదుపు బాటలో సీఎం

**కాన్వాయ్‌లో 50శాతం వాహనాల తగ్గింపు**

**డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌తో సమావేశంలో ఆదేశాలు**

అమరావతి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించిన ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పర్యటనల సమయంలో తన కాన్వాయ్‌లో ఉండే వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించి ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధాని మోదీ ఇటీవల సూచించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగం కూడా దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలనే ఉద్దేశంతో ఈ ఆదేశాలు ఇచ్చారు. డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌తో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. జిల్లా పర్యటనల్లో ముఖ్యమంత్రి కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను సగానికి తగ్గించాలని అధికారులను ఆదేశించారు. భద్రతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుంటూనే అనవసర వాహనాల వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు.

**అమరావతితో పాటే విశాఖ అభివృద్ది**

**అక్కడ ఇప్పటికే అనేక సంస్థలు రాక**

**టెక్నాలజీ హబ్‌గా రాయలసీమ**

**తిరుపతిలో ఏరోస్పేస్ సిటీ అభివృద్ది**

**కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు**

**కిమ్స్ ఆసుపత్రి శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు**

ముఖ్యమంత్రి కాన్వాయ్‌కే పరిమితం కాకుండా మంత్రులు, ఇతర వీఐపీలు కూడా సాధ్యమైనంత తక్కువ వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. అన్నిస్థాయిల్లో 50 శాతం వాహనాల తగ్గింపు అమలు అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ వ్యవస్థలో పొదుపు సంస్కృతి పెంపొందించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ప్రతి ఒక్కరూ ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఇంధన వినియోగం తగ్గించడం ద్వారా ఆర్థిక భారం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అవుతుందని సీఎం తెలిపారు. కాన్వాయ్ వాహనాల తగ్గింపుతో పాటు ప్రభుత్వ ఖర్చుల నియంత్రణ, ఇంధన పొదుపు, పరిపాలనా వ్యయాల తగ్గింపు వంటి అంశాలపై ఇప్పటికే అధికార స్థాయిలో కసరత్తు ప్రారంభమైంది.

## నీట్‌ను పూర్తిగా రద్దు చేయాలి



**తమిళనాడు సిఎం విజయ్ డిమాండ్**

చెన్నై: దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే 'జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీ'ని (నీట్-యూజీ) మొత్తానికే రద్దు చేయాలని తమిళనాడు సీఎం విజయ్ డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ కావడం, పరీక్ష రద్దు వంటివి.. వ్యవస్థాగత లోపాలకు నిదర్శనమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొదటినుంచి నీట్‌ను తమిళనాడు వ్యతిరేకించిన అంశాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ పరీక్షతో గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలలు, తమిళ మాధ్యమానికి చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో 12వ తరగతి మార్కుల ఆధారంగా సీట్లను భర్తీ చేసేందుకు రాష్ట్రాలకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి సీఎం విజయ్ విజ్ఞప్తి చేశారు. నీట్ రద్దు చేయడం ద్వారా రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇవ్వాలన్నారు.

## 15న ఆధారాలతో విచారణకు వస్తా

**పోలీసులకు బండి భగీరథ్ లేఖ**



హైదరాబాద్: పేట్ బషీరాబాద్ పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఓ లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల నేపథ్యంలో మే 15వ తేదీన విచారణకు హాజరవుతానని తన లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా బండి భగీరథ పంపించారు. ఈ కేసులో విచారణకు హాజరయ్యే సమయంలో కీలక ఆధారాలు, సాక్ష్యాలతో వస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని భగీరథ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. బండి భగీరథ పంపిన లేఖ ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మే 15వ తేదీన జరగనున్న విచారణలో ఆయన సమర్పించే ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉంది.



## పొదుపు సూత్రాలు తెలంగాణకు

# నిధులు మాత్రం ఆంధ్రాకా ..?

**ప్రధాని తీరుపై మండిపడ్డ కవిత**

**భగీరథ్ పారిపోకుండా లుకౌట్ నోటీసులు ఇవ్వాలని డిమాండ్**

హైదరాబాద్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్ట్‌ను 5 సార్లు

సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్ఎస్

ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ÷ఎలగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.

# ‘బేటీ బచావో’ నినాదం ఏమైంది?

మొదటి పేజీ తరువాయి

స్పష్టమవుతోంది. గతంలో కాలేజీలో తోటి విద్యార్థులపై దాడి చేసిన ఉదంతాలు ఉండటం.. ఇప్పుడు ఏకంగా మైనర్ బాలికపై వేధింపులకు పాల్పడటం చూస్తుంటే నిందితుడి సైకాలజీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వ్యవస్థలో ఉన్న లొసుగులను వాడుకుంటూ తప్పించుకోవాలని చూడటం సభ్య సమాజానికి గొడ్డలి పెట్టు. బేటీ బచావో.. బేటీ పడావో వంటి ఆకర్షణీయమైన నినాదాలు ఇచ్చే బీజేపీ ప్రభుత్వం.. సొంత పార్టీ నేత కుమారుడు ఒక ఆడబిడ్డ జీవితంతో ఆడుకున్నప్పుడు ఎందుకు మౌనంగా ఉందో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారం ఉంటే ఏదైనా చేయొచ్చనే ధీమాతో నేరస్థులు రెచ్చిపోతుంటే.. రక్షణ కల్పించాల్సిన బాధ్యత కలిగిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. కేటీఆర్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన విమర్శలు ప్రతి పౌరుడి ఆలోచనను ప్రతిబింబిస్తున్నాయి. పోక్సో చట్టం అమల్లో ఉన్నా.. నిందితుడు మీడియా ముందుకు వచ్చి ఇంటర్వ్యూలు ఇవ్వడం, బాధితురాలి వ్యక్తిత్వాన్ని హననం చేసేలా కామెంట్స్ చేయడం చూస్తుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాజకీయ ఒత్తిళ్ల వల్ల దర్యాప్తు సంస్థలు చేష్టలుడిగి చూడటం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా మిగిలిపోతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి కూడా ఈ విషయంలో చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు డ్రగ్స్ కేసుల్లో సెలబ్రిటీలను వదలబోమని హెచ్చరించే సీఎం.. ఈ పోక్సో కేసులో కేంద్ర మంత్రి కుమారుడి పట్ల సాఫ్ట్ కార్నర్ ప్రదర్శిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. రాజకీయ ప్రత్యర్థులను వేధించే విషయంలో చూపించే ఉత్సాహం.. ఇలాంటి నేరస్తుల విషయంలో ఎందుకు కనిపించడం లేదని విపక్షాలు నిలదీస్తున్నాయి. రాజకీయ ప్రయోజనాల కోసం బాధితులకు అన్యాయం చేయడం తగదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న ఏదో ఒక రహస్య ఒప్పందం వల్లే ఈ కేసులో కాలయాపన జరుగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బాధితురాలు ఆత్మహత్యాయత్నం చేసినా.. నిందితుడు యథేచ్ఛగా తిరుగుతుండటం వ్యవస్థ వైఫల్యానికి పరాకాష్ట. బాధితులకు భరోసా ఇవ్వాల్సిన పాలకులు నిందితులకు కొమ్ముకాస్తున్నారనే ముద్ర పడకుండా జాగ్రత్త పడాలి. సోషల్ మీడియా వేదికగా నిందితుడిని వెనకేసుకొచ్చే బ్యాచ్ ఒకటి బాధితురాలిపైనే బురదజల్లే ప్రయత్నం చేయడం అత్యంత హేయం. హనీ ట్రాప్ వంటి పదాలు వాడుతూ నేరాన్ని డైవర్ట్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. బాధిత మైనర్ బాలిక గుర్తింపును బయటపెట్టడం చట్టరీత్యా నేరం అయినప్పటికీ.. కొన్ని యూట్యూబ్ ఛానెళ్లు, ఐటీ సెల్ కార్యకర్తలు బాహాటంగానే నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఇలాంటి ప్రచారాల వల్ల బాధితులు మరింత మానసిక క్షోభకు గురవుతున్నారు. ఒక తండ్రిగా తన కొడుకును మందలించాల్సిన కేంద్ర మంత్రి.. బాధితురాలి కుటుంబాన్నే బెదిరించేలా మాట్లాడటం గర్హనీయం. చట్టం తన పని తాను చేయనివ్వకుండా అడ్డుపడటం ఏ రకమైన రాజధర్మమో ఆత్మావలోకనం చేసుకోవాలి. న్యాయం కోసం పోరాడే వారికి అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఈ కేసును సిట్ పరిధిలోకి తీసుకురావడం విచారణను నీరుగార్చడానికేనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆధారాలు బలంగా ఉన్నప్పటికీ.. నిందితుడు దొరకలేదని చెప్పడం పోలీసుల అసమర్థతను సూచిస్తోంది. స్ప్లిట్ పర్సనాలిటీతో వ్యవహరించే ఇలాంటి వ్యక్తులు సమాజంలో స్వేచ్ఛగా తిరగడం వల్ల భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. చైల్డ్ రైట్స్ కమిషన్ ఈ వ్యవహారంపై సుమోటోగా స్పందించి సమగ్ర దర్యాప్తు జరిపించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కేవలం రాజకీయ పలుకుబడి ఉందనే కారణంతో నేరస్తుడికి క్లీన్ చిట్ ఇస్తే.. ప్రజల్లో చట్టంపై ఉన్న గౌరవం నశిస్తుంది. కేసును త్వరితగతిన తేల్చి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేయడం ద్వారానే వ్యవస్థ తన విశ్వసనీయతను నిలబెట్టుకోగలదు. నిందితుడి గత ప్రవర్తనను కూడా పరిగణనలోకి తీసుకుని విచారణ సాగించాలి. ప్రజాస్వామ్యంలో పాలకుల వారసులు తాము చట్టానికి అతీతులమని భావించడం విపరీత ధోరణి. కేటీఆర్ సంధించిన విమర్శనాస్త్రాలు ఇప్పుడు బిజెపిని ఇరకాటంలోకి నెట్టాయి. న్యాయం విషయంలో కూడా ‘వన్ నేషన్.. వన్ రూల్’ ఉండాలని సామాన్యులు కోరుకుంటున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితురాలికి న్యాయం జరిగేలా చూడాలి. నిందితుడు ఎంతటి బలవంతుడైనా సరే.. చట్టం ముందు మోకరిల్లాల్సిందేనని నిరూపించాలి. అప్పుడే సమాజంలో ఆడపిల్లలకు భద్రత ఉంటుంది. ఈ కేసు కేవలం ఒక వ్యక్తికి సంబంధించింది కాదు.. ఇది మొత్తం వ్యవస్థ పనితీరుకు ఒక పరీక్ష వంటిది. రాజకీయ రంగు పూయకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలని యావత్ రాష్ట్రం కోరుకుంటోంది. న్యాయం ఆలస్యం కావచ్చు కానీ.. అది తప్పకుండా జరుగుతుందని బాధితులు నమ్మేలా చర్యలు ఉండాలి.

## మొదటి పేజీ తరువాయి

## రప్పిస్తారా? తప్పిస్తారా?

ఈ ఉదంతాన్ని ఎంత లోతుగా తవ్వుతారో వేచి చూడాల్సిందే. నిందితుడి వెనుక ఉన్న రాజకీయ ఛత్రచ్ఛాయలు బాధితులకు న్యాయం జరగకుండా అడ్డుపడతాయా అనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. చట్టం తన పని తాను చేసుకుపోతుందో లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతుందోనని సామాన్యులు ఆసక్తిగా గమనిస్తున్నారు. నిందితుడి గతాన్ని పరిశీలిస్తే అతను ఒక హ్యాబిచువల్ అఫెండర్‌గా కనిపిస్తున్నాడని తాజా విశ్లేషణలు చెబుతున్నాయి. గతంలో కాలేజీ రోజుల్లో ఇతర విద్యార్థులపై భౌతిక దాడులు చేయడం, గ్యాంగులను మెయింటైన్ చేయడం వంటి ఉదంతాలు అతని దూకుడు స్వభావాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా ఒక మైనర్ బాలికను ప్రేమ పేరుతో వంచించి.. ఫిజికల్ అబ్యూస్‌కు పాల్పడటం అత్యంత దారుణమైన విషయం. బాధితురాలు ఆ ఒత్తిడిని భరించలేక రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేయడం ఈ సమస్య తీవ్రతను చాటి చెబుతోంది. ఒక తండ్రిగా కేంద్ర మంత్రి తన కుమారుడిని సరైన మార్గంలో పెట్టాల్సింది పోయి.. బాధితులనే కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్యంలో గర్హనీయం. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారు ఇలాంటి సున్నితమైన అంశాలలో ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్షార్హులనే సంకేతాలు పంపాల్సిన నాయకులు.. సొంతవారిని వెనకేసుకొచ్చినప్పుడు వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతుంది. రాజకీయంగా విమర్శలు గుప్పిస్తున్న నాయకులు వాస్తవానికి వచ్చేసరికి ఒకే వేదికపై చిరునవ్వులు చిందించడం బాధిత కుటుంబానికి తీవ్ర నిరాశను మిగిల్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకవైపు అల్లు అర్జున్ వంటి స్టార్ల విషయంలో చట్టం అందరికీ సమానమని చెబుతూనే.. మరోవైపు నిందితుడి తండ్రిని “ప్రియమిత్ర” అని సంబోధించడం విడ్డూరంగా ఉంది. ఈ దోస్తీ వెనుక ఉన్న మర్మమేంటో సామాన్య జనానికి అర్థం కావడం లేదు. పోక్సో చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకోవడంలో పోలీసులు జాప్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా రాజకీయ నేతల మధ్య ఉండే ఈ లోపాయికారి ఒప్పందాలు బాధితుల పాలిట శాపంగా మారుతున్నాయి. ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమనే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ఇది ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలి పెట్టుగా పరిణమించే ప్రమాదం ఉంది. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయడం నిందితుడిని కాపాడటానికేనా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఆధారాలు బలంగా ఉన్నప్పుడు.. నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు ప్రకటించడం వెనుక ఉన్న రాజకీయ ఒత్తిడిని కొట్టిపారేయలేము.

### ‘డబుల్ ఇంజిన్’ అంటే పేపర్ల లీకేజీయేనా?

ఉదంతం దేశ విద్యా వ్యవస్థకే మచ్చ తెచ్చిందని పొంగులేటి మండిపడ్డారు. పరీక్ష ప్రారంభానికి సుమారు 42 గంటల ముందే ప్రశ్నపత్రాలు బయటకు రావడం చూస్తుంటే వ్యవస్థలు ఎంతలా భ్రష్టుపట్టాయో అర్థమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు ఈ మెగా స్కామ్ వల్ల రోడ్డున పడ్డారని.. మన రాష్ట్రంలోనూ 70 వేల మంది బాధితులుగా మిగిలారని గణాంకాలతో వివరించారు. కష్టపడి చదివిన విద్యార్థుల కంటే.. అడ్డదారిలో పేపర్లు కొన్నవారికే సీట్లు దక్కే పరిస్థితి రావడం దారుణమన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే పేపర్లు లీక్ చేసి నిరుద్యోగుల గొంతు కోయడమేనా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను కఠినంగా శిక్షించడంలో కేంద్రం మీనమేషాలు లెక్కించడంపై ఆయన ఫైర్ అయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును సైతం మంత్రి తీవ్రస్థాయిలో ఎండగట్టారు. గత పదేళ్ల పాలనలో గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు ప్రతి పరీక్షా పత్రం లీక్ అయిందని ఆరోపించారు. ఆనాటి ప్రభుత్వ పెద్దల అండదండలతో మంత్రుల వ్యక్తిగత సహాయకులే జిరాక్స్ సెంటర్లలో పేపర్లు అమ్ముకున్నారంటే పరిస్థితి ఎంత దిగజారిందో ఊహించుకోవచ్చన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పరీక్షల నిర్వహణ లోపాల వల్ల నిరుద్యోగులు మానసిక వేదనకు గురయ్యారని గుర్తు చేశారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ ఫలితాల తారుమారు వల్ల 28 మంది అమాయక విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం ఆనాటి ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట అని విమర్శించారు. నేడు కేంద్రంలోని బీజేపీ సైతం అదే బాటలో పయనిస్తూ యువత ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు పార్టీల డీఎన్ఏ ఒకటేనని.. అందుకే నిరుద్యోగుల బాధలు వీరికి పట్టడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియామక సంస్థల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందని మంత్రి వివరించారు. టీఎస్‌పీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేసి.. రాజకీయ జోక్యం లేని పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేశామని గర్వంగా చెప్పారు. తాము బాధ్యతలు చేపట్టిన స్వల్ప కాలంలోనే ఎక్కడా చిన్న పొరపాటుకు తావులేకుండా 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని వెల్లడించారు.

### దేశ ఇంధన రంగం రాత మారబోతోంది

నాయకత్వంలో భారతదేశం ఇంధన స్వయం సమృద్ధి దిశగా వడివడిగ అడుగులు వేస్తోందని ఆయన కొనియాడారు. బొగ్గు వనరులను అత్యంత సమర్థవంతంగా వినియోగించుకోవడమే కాకుండా పర్యావరణ హితమైన ఇంధన వనరుల సృష్టికి ఈ నిర్ణయం మార్గం సుగమం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం ప్రకటించిన ఈ భారీ ప్రోత్సాహకాలు దేశ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చివేస్తాయని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా సర్ఫేస్ కోల్ అంటే నేల బొగ్గుతో పాటు లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు కేంద్రం నడుం బిగించిందని రాంచందర్ రావు వివరించారు. ఈ బృహత్తర లక్ష్యం కోసం ఏకంగా రూ. 37,500 కోట్ల విలువైన భారీ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం ఒక చారిత్రక ఘట్టమని ఆయన అభివర్ణించారు. శిలాజ ఇంధనాల వినియోగంలో అత్యాధునిక సాంకేతికతను జోడించడం ద్వారా దేశ వనరులకు గరిష్ట విలువను చేకూర్చాలన్న ప్రభుత్వ సంకల్పం ఇందులో కనిపిస్తోందని పేర్కొన్నారు. ఈ నిధుల కేటాయింపు ద్వారా గ్యాసిఫికేషన్ రంగంలోకి ప్రైవేట్ భాగస్వామ్యం భారీగా పెరిగే అవకాశం ఉందని విశ్లేషించారు. భారతదేశం 2030వ సంవత్సరం నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్‌ను సాధించాలన్న అత్యున్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుందని రాంచందర్ రావు గుర్తు చేశారు. ఈ భారీ లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర మంత్రివర్గం తీసుకున్న తాజా నిర్ణయం దేశ ఇంధన ప్రణాళికకు గొప్ప ఊతాన్ని ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిర్దేశిత కాలపరిమితిలోగా వంద మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫికేషన్ ప్రక్రియలోకి తీసుకురావడం ద్వారా దేశీయంగా లభ్యమయ్యే బొగ్గు నిల్వలకు డిమాండ్ పెరగడమే కాకుండా విదేశీ మారక ద్రవ్యం కూడా ఆదా అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలో అపారంగా అందుబాటులో ఉన్న బొగ్గు వనరులను కేవలం కాల్చడానికి మాత్రమే కాకుండా వాటిని అత్యంత విలువైన స్వచ్ఛమైన ఇంధనాలుగా మార్చే ప్రక్రియను కేంద్రం వేగవంతం చేస్తోందని ఆయన వెల్లడించారు.

## అగ్నిపర్వతంలా పేలిన బంగారం ధరలు

**హైదరాబాద్:** పసిడితో పాటు వెండి, ప్లాటినం వంటి విలువైన లోహాల దిగుమతులపై కూడా ఈ ప్రభావం పడనుంది. తాజా నోటిఫికేషన్ విడుదల చేసిన వెనువెంటనే ఈ పెంచిన పన్నులు అమలులోకి రావడంతో బులియన్ మార్కెట్‌లో ధరల అగ్నిపర్వతం బద్దలైంది. ఈ నిర్ణయం సామాన్యులకు పసిడిని అందనంత ఎత్తుకు చేర్చింది. పండుగలు, వివాహాల సీజన్ ముంగిట ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య కొనుగోలుదారుల జేబులకు భారీ చిల్లు పెట్టింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో పసిడి ధరల పెరుగుదల రికార్డు స్థాయికి చేరింది. ట్రేడింగ్ ప్రారంభమైన కొద్ది సమయంలోనే బంగారం ధర ఆరు శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయడం విశేషం. గడిచిన కాలంలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు ఈ స్థాయిలో ధరలు పెరగడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది. పది గ్రాముల బంగారం ధర తొలుత రూ. 1,53,962 వద్ద లాభాలతో ప్రారంభమైనప్పటికీ, కాసేపటికే గరిష్టంగా రూ. 1,63,243 స్థాయికి చేరి రికార్డు సృష్టించింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఒక్కో దశలో సుమారు 13,500 రూపాయలకు పైగా లాభాన్ని నమోదు చేయడం మార్కెట్ తీవ్రతను ప్రతిబింబిస్తోంది. ఈ పెరుగుదల ధోరణి అక్కడితో ఆగకుండా 14,000 రూపాయల మార్కును తాకడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లలోనూ పసిడి ధరల సెగలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కామెక్స్ ఎక్స్ఛేంజ్‌లో పసిడి ఔన్సుకు 4,830 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతూ ప్రపంచవ్యాప్త డిమాండ్‌ను చాటుతోంది. దేశీయంగా పెరిగిన సుంకాలు అంతర్జాతీయంగా ఉన్న అనిశ్చితి తోడవడంతో ధరలు నియంత్రణ లేకుండా సాగుతున్నాయి. పెట్టుబడిదారులు సురక్షితమైన మార్గంగా పసిడిని ఎంచుకోవడం కూడా ఈ అమాంతం పెరుగుదలకు ఒక కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. దిగుమతి సుంకాల పెంపు వల్ల దేశీయ మార్కెట్లకు సరఫరా తగ్గే అవకాశం ఉండటంతో ధరలు భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో ఉండే అవకాశం కనిపిస్తోంది. పసిడి ధరలు 1,60,000 మార్కును అధిగమించడం మార్కెట్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. దేశ రాజధాని ఢిల్లీ నుంచి గులాబీ నగరం జైపూర్ వరకు పసిడి ధరలు మంట పుట్టిస్తున్నాయి. ఈ నగరాలలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,51,500గా నమోదైంది. నాణ్యమైన 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,63,090 వద్ద ట్రేడ్ అవుతోంది. సాధారణంగా ఉండే ధరల కంటే ఈ పెరుగుదల వినియోగదారులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. అటు అహ్మదాబాద్ నుంచి పూణే వరకు కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ నగరాలలో 22 క్యారెట్ల పసిడి రూ. 1,51,450 పలకగా, 24 క్యారెట్ల ధర రూ. 1,63,990 స్థాయిని తాకింది. ఈ గణాంకాలు దేశవ్యాప్తంగా పసిడి మార్కెట్ ఏ విధంగా అస్థిరతకు గురైందో స్పష్టంగా తెలియజేస్తున్నాయి. దక్షిణాది ప్రధాన నగరాలైన హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరులో పసిడి ధరలు దాదాపు ఒకే తీరుగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతాలలో 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1,51,400గా స్థిరపడింది. 24 క్యారెట్ల పసిడి ధర రూ. 1,62,990 వద్ద అమ్మకాలను జరుపుకుంటోంది. దక్షిణాదిలో వివాహాల కోసం బంగారం కొనుగోలు చేసే వారి సంఖ్య అత్యధికంగా ఉండటంతో ఈ ధరల పెరుగుదల ఇక్కడి మధ్యతరగతి కుటుంబాలపై తీరని ప్రభావాన్ని చూపుతోంది. అటు తూర్పు భారత్ లోని కోల్‌కతాలో కూడా పసిడి రేట్లు ఆకాశాన్నంటాయి. అక్కడ 22 క్యారెట్ల ధర రూ. 1,53,400 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,62,830గా నమోదైంది. ముంబై మెట్రో నగరం పసిడి ధరల పెరుగుదలలో తనదైన దూకుడును ప్రదర్శించింది. ఆర్థిక రాజధానిలో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 16,789గా నమోదైంది.

## భగీరథ్‌పై లుక్ ఔట్ నోటీసులు ఇవ్వండి

**హైదరాబాద్:** ఇంటి సభ్యులపై ఇన్ని ఆరోపణలు వెల్లువెత్తుతున్న తరుణంలో.. కనీస నైతికత లేకుండా ఆ సభకు హాజరుకావడం దేనికి సంకేతమని ఆమె ప్రశ్నించారు. సమాజంలో పలుకుబడి ఉన్న పెద్దల పిల్లలు ఎలాంటి అకృత్యాలకు పాల్పడినా చట్టం చుట్టంలా మారిపోతుందనే అపసవ్యమైన సందేశం ఈ ఘటన ద్వారా ప్రజల్లోకి వెళ్లిందని విమర్శించారు. నిందితులను విదేశాలకు దాటించి రక్షణ కల్పించడం బీజేపీకి మొదటి నుంచీ వెన్నతో పెట్టిన విద్య అని కవిత దుయ్యబట్టారు. గతంలో ప్రజ్వల్ రేవణ్ణ ఉదంతంలో కూడా ఇదే తీరును అవలంబించారని గుర్తు చేస్తూ.. ఇప్పుడు బండి సంజయ్ కుమారుడి విషయంలోనూ అదే పునరావృతమయ్యేలా కనిపిస్తోందని హెచ్చరించారు. ఈ క్రమంలోనే తక్షణమే నిందితుడిపై లుక్ ఔట్ నోటీసులు ఇవ్వాలని కోరారు. కొందరు సోషల్ మీడియా వేదికగా ఈ సమస్య పరిష్కారమైందంటూ తప్పుడు బిల్డప్ ఇస్తున్నారని మండిపడ్డారు. బాధితురాలు ఒక మైనర్ బాలిక అన్న విషయాన్ని విస్మరించి ఇష్టానుసారంగా పోస్టులు పెడుతున్న తీరును ఆమె ఎండగట్టారు. మన సమాజంలో మగపిల్లల తప్పులను చాలా సులభంగా విస్మరిస్తారని.. అదే ఆడపిల్లల విషయానికి వస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని వ్యాఖ్యానించారు. ఈ వివక్షపూరిత ధోరణి మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె నొక్కి చెప్పారు. దురదృష్టవశాత్తూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం ప్రదర్శించిన అత్యుత్సాహం వల్ల బాధితురాలి ఫొటోలు బహిర్గతమవ్వడంపై కవిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి సున్నితమైన అంశాల్లో బాధితుల వివరాలు బయటకు రావడం వల్ల వారి భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుందని ఆందోళన చెందారు. నిబంధనలను ఉల్లంఘించి ఫొటోలను షేర్ చేసిన ఖాతాలను వెంటనే గుర్తించి.. వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీసులను కోరారు. తాను ఈ అంశంలో రాజకీయ లబ్ధి కోసం మాట్లాడటం లేదని.. ఒక మహిళగా బాధితురాలికి న్యాయం జరగడమే తన ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనపై స్పందిస్తూ.. రాష్ట్రానికి ఏదైనా మేలు జరుగుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. కేవలం పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వర్షం కురిపించి.. తెలంగాణకు మాత్రం పొదుపు పాఠాలు చెప్పడం కేంద్ర వివక్షకు పరాకాష్ట అని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న మొండి వైఖరిని కవిత తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జాతీయ హోదా కోసం ప్రధానమంత్రికి తక్షణం లేఖ రాయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. గతంలో 16 రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించిన కేంద్రం.. తెలంగాణకు ఎందుకు మొండిచేయి చూపుతోందని ప్రశ్నించారు. ఈ అన్యాయంపై తమ పోరాటం ఆగదని.. రాష్ట్ర నీటి హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంటులో ఆమోదం తెలపాలని కోరుతూ.. సామాజిక న్యాయం విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. తెలంగాణ గడ్డపై నీటి వాటా కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని పునరుద్ఘాటించారు.

## ఫ్యూచర్ సిటీలోకి ‘ఉబెర్’ ఎంట్రీ

మొదటి పేజీ తరువాయి

ఉండటం గమనార్హం. ప్రస్తుతం ఇక్కడ 600 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు పనిచేస్తూ గ్లోబల్ మార్కెట్లకు అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నారని దారా ఖోస్రోషాహి ముఖ్యమంత్రికి వివరించారు. తెలంగాణలో ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యాపార అనుకూల విధానాలు తమ సంస్థ వృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని ఆయన ప్రశంసించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉబెర్ సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన ప్రణాళికలు ఇప్పటికే సిద్ధమయ్యాయని ప్రతినిధి బృందం వెల్లడించింది. భవిష్యత్తులో హైదరాబాద్‌ను తమ కార్యకలాపాలకు గ్లోబల్ హబ్‌గా మార్చుకోవాలనే లక్ష్యంతో ఉన్నట్లు ఉబెర్ చీఫ్ ఈ సమావేశంలో స్పష్టం చేశారు. ప్రభుత్వ సహకారం ఉంటే మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు తమ సంస్థ వెనుకాడబోదని ఆయన హామీ ఇచ్చారు. మెట్రో రైలు ప్రయాణికులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య పార్కింగ్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గమనించారు. మెట్రో స్టేషన్ల వద్ద వాహనాలను నిలిపేందుకు తగిన చోటు లేకపోవడం వల్ల సాధారణ ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఉబెర్ బృందానికి వివరించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీలో భాగంగా మెట్రో స్టేషన్ల వద్ద మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని ఆయన సూచించారు. వీటితో పాటు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈవీ ఛార్జింగ్ కేంద్రాలను కూడా అదే ప్రాంగణాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. పర్యావరణ హితమైన రవాణా వ్యవస్థను నిర్మించడంలో ఉబెర్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషించగలవని సీఎం ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన ఈ వినూత్న సలహాపై సమగ్రమైన అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. నగర రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు టెక్నాలజీని ఎలా వాడుకోవాలో త్వరలోనే ఒక నివేదిక ఇస్తామని వారు తెలిపారు. హైదరాబాద్ శివార్లలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న ‘భారత్ ఫ్యూచర్ సిటీ’ గురించి ముఖ్యమంత్రి గర్వంగా వివరించారు. దాదాపు 30 వేల ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ నగరం భవిష్యత్ తరాలకు మణిహారంగా నిలుస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచంలోని టాప్ 500 దిగ్గజ కంపెనీలను ఈ ఫ్యూచర్ సిటీకి రప్పించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన చెప్పారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ సంస్థలు తమ కార్యాలయాల ఏర్పాటుకు భూమిని కోరుతూ ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలోనే ఈ నగరం ఉండటం రవాణా పరంగా పెద్ద అడ్వాంటేజ్ అని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో వందకు పైగా కంపెనీలు పాల్గొని భారీ పెట్టుబడులు పెట్టేందుకు ఎంఓయూలు కుదుర్చుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# విజేయుడు

మొదటి పేజీ తరువాయి

కమ్యూనిస్టు పార్టీలు, వీసీకే వంటి మిత్రపక్షాల మద్దతుతో పాటు అన్నాడీఎంకేకు చెందిన ఒక వర్గం ఎమ్మెల్యేలు విజయ్‌కు జై కొట్టడం ఇక్కడ విశేషం. అధికార పక్షం వ్యూహాలకు చిక్కిన అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు బాహాటంగానే టీవీకేకు మద్దతు పలికి తమ విధేయతను చాటుకున్నారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం డీఎంకే మాత్రం ఈ కీలక ఓటింగ్‌కు దూరంగా ఉంటూ సభ నుంచి వాకౌట్ చేయడం గమనార్హం. కేవలం 22 మంది అన్నాడీఎంకే సభ్యులు మాత్రమే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో విజయ్ టీమ్ ఈజీగా గట్టెక్కింది. ఈ విజయంతో విజయ్ ప్రభుత్వం తన తొలి గండాన్ని విజయవంతంగా దాటి ఫుల్ జోష్‌లో ఉంది. ఎన్నికల నగారా మోగకముందే విజయ్ తన పొలిటికల్ నెట్‌వర్క్‌ను అత్యంత చాకచక్యంగా విస్తరించుకున్నారు. అన్నాడీఎంకేలోని కీలక నేతలతో ముందే టచ్‌లోకి వెళ్లి పొత్తుల విషయంలో సుదీర్ఘ చర్చలు జరిపారు. పార్టీలోని మెజారిటీ నేతలు విజయ్‌తో చేతులు కలిపేందుకు ఆసక్తి చూపినప్పటికీ.. ఆ పార్టీ అధినేత పళనిస్వామి మొండివైఖరి వల్ల ఆ ప్రయత్నాలు కార్యరూపం దాల్చలేదు. ఇష్టం లేకపోయినా బీజేపీతో కలిసి ప్రయాణించాల్సి రావడంపై అన్నాడీఎంకేలోని ఒక వర్గం తీవ్ర అసంతృప్తితో ఉంటూ వచ్చింది. ఎన్నికల ఫలితాలు వెలువడి టీవీకే ప్రభంజనం సృష్టించడంతో ఆ అసమ్మతి జ్వాలలు ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి. పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన రెబల్ ఎమ్మెల్యేలు.. తమకంటూ ప్రత్యేక కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకుని సంచలనం సృష్టించారు. ఆ పరిణామాల కొనసాగింపుగానే ఇప్పుడు అసెంబ్లీలో విజయ్ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచి తమ ఆగ్రహాన్ని ప్రదర్శించారు. విశ్వాస పరీక్షలో సాధించిన ఈ మెజారిటీ కేవలం ఒక అంకె మాత్రమే కాదు.. ఇది విజయ్ రాజకీయ వ్యూహరచనకు నిదర్శనం. ముఖ్యంగా అన్నాడీఎంకే రెబల్స్ మద్దతు కూడగట్టడం ద్వారా బీజేపీ పెత్తనాన్ని సహించే ప్రసక్తే లేదని ఆ నేతలు పరోక్షంగా ఢిల్లీ పెద్దలకు సంకేతాలు పంపారు. ప్రాంతీయ ఆకాంక్షల ప్రతిబింబంగా పుట్టుకొచ్చిన టీవీకేను ఆదరించడం ద్వారా తమిళనాట కొత్త రాజకీయ ధృవీకరణకు పునాదులు పడ్డాయి. పళనిస్వామి వైఖరితో విసిగిపోయిన ఎమ్మెల్యేలకు విజయ్ ఒక ఆశాకిరణంలా కనిపించారు. దీంతోనే తమ రాజకీయ భవిష్యత్తు కోసం.. రాష్ట్ర ప్రయోజనాల కోసం విజయ్ వెంట నడవాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే అన్నాడీఎంకే ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకోవడంలో టీవీకే సక్సెస్ అయింది. బలపరీక్షలో నెగ్గిన తర్వాత విజయ్ ముఖంలో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం.. రాబోయే ఐదేళ్ల పాలనలో సంస్కరణల పర్వానికి నాంది పలకబోతోందని స్పష్టం చేస్తోంది. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టం.. కానీ విజయ్ మాత్రం తనదైన శైలిలో పక్కా ప్లానింగ్‌తో వెళ్తున్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు తెరవెనుక కుతంత్రాలు జరుగుతున్నాయనే ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ ఏకంగా 144 ఓట్లతో పవర్‌ఫుల్ మెసేజ్ ఇచ్చారు. కేవలం మిత్రపక్షాలనే కాకుండా ప్రత్యర్థి పార్టీల్లోని అసమ్మతి నేతలను సైతం తన వైపు తిప్పుకోవడంలో ఆయన చూపిన చొరవ అద్భుతం. తన గెలుపును కేవలం అదృష్టంగా కాకుండా కష్టపడి సంపాదించుకున్న ఫలితంగా ఆయన భావిస్తున్నారు. ఐదేళ్ల పాటు స్థిరమైన పరిపాలన అందిస్తామని.. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పథకాలు రచిస్తామని ఆయన ప్రకటిస్తున్నారు. ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం చెప్పడం కంటే చేతల్లో చూపించడమే మిన్న అని ఆయన విశ్వసిస్తున్నారు. తమిళనాడు ప్రజలు కోరుకున్న మార్పు దిశగా తన ప్రయాణం సాగుతుందని ఆయన ఘంటాపథంగా చెబుతున్నారు. విజయ్ తన ప్రసంగాల్లో తరచుగా వాడే “తమిళుల ఆత్మగౌరవం” అనే నినాదం ఇప్పుడు శాసనసభలోనూ ప్రతిధ్వనిస్తోంది. స్పీకర్ ఎంపిక నుంచి విశ్వాస పరీక్ష వరకు ఆయన ప్రతి నిర్ణయంలోనూ ఆ స్ఫూర్తి కనిపిస్తోంది.

ఉత్తేజిత దినపత్రిక



# నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి ప్రధాని మోడీ నైతిక బాధ్యత వహించాలి

**పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం మరియు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఏ) వరుసగా విఫలమవ్వడం సిగ్గుచేటు**

**వి భరత్ కుమార్ ఆచారి రాష్ట్ర అధ్యక్షులు బిసి ఎస్సి ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమాఖ్య**



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ (నీట్ యు జి 2026) ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నైతిక బాధ్యత వహించాలని బిసి ఎస్సి ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు భరత్ కుమార్ ఆచారి ఒక ప్రకటన లో డిమాండ్ చేసారు . పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం మరియు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (టీూూ) వరుసగా విఫలమవ్వడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు.

ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ మొన్న గుజరాత్, నిన్న బీహార్, నేడు రాజస్థాన్.. ఇలా బీజేపీ పాలిత రాష్ట్రాలే పేపర్ లీకులకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. దేశమంతా పేపర్ లీకుల సామ్రాజ్యాన్ని మోడీ గారు దగ్గరుండి విస్తరిస్తున్నారని ఆరోపించారు.ఎన్ టి ఏ అంటే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కాదు, అది 'ప్రశ్నపత్రాలను వేలం వేసే సంస్థ'గా మారిందని, దానికి వేలంపాట దారుడు నరేంద్ర మోడీ అని తీవ్రంగా విమర్శించారు. పరీక్షకు 48 గంటల ముందే 122 ప్రశ్నలు బయటకు వెళ్లాయంటే, కేంద్ర ప్రభుత్వ అసమర్థత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. వేలం లెక్కన ప్రశ్నాపత్రాలు అమ్ముడుపోవడం దేశ విద్యా వ్యవస్థకే మాయని మచ్చఅని,

రాత్రింబవళ్లు కష్టపడి చదివిన 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం అగమ్యగోచరంలోకి నెట్టింది. పేపర్లు లీక్ చేసి, మళ్లీ రాసుకోండి అని చెప్పడం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసిక వేదనకు గురి చేయడమేఅని,గత 11 ఏళ్ల బీజేపీ పాలనలో 89 సార్లు పేపర్ లీకులు జరిగాయని, 48 సార్లు పునః పరీక్షలు నిర్వహించారని, ఇదేనా మీరు సాధించిన ఘనకార్యం అని ఆయన ప్రశ్నించారు.

ప్రవేశ పరీక్షల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం ఆపాలని డాక్టర్ మద్దులేటి స్వామి హెచ్చరించారు. ఈ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


# పిఠాపురం టెన్త్ టాపర్లకు పవన్ కళ్యాణ్ గిఫ్ట్.. ఉచిత ఉన్నత విద్య



పిఠాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా విద్యారంగంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహం అందించే కార్యక్రమాలు చేపడుతున్నారు. తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో 580కిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్య అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు.పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 31 మంది విద్యార్థులు 580 మార్కులకు పైగా సాధించినట్లు గుర్తించారు. వీరిలో 598 మార్కులతో రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలిచిన ఒక విద్యార్థి కూడా ఉన్నారు. ఈ ప్రతిభావంతులైన విద్యార్థుల భవిష్యత్తు కోసం వారి అభిరుచికి అనుగుణంగా కోర్సులు, కళాశాలలు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు.ఇప్పటికే తల్లిదండ్రులు లేని పిల్లలకు నెలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్న పవన్ కళ్యాణ్, ఇప్పుడు అదే పిల్లల్లో ఏడుగురు 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించడంతో వారికి ఉన్నత విద్యాభ్యాసం కోసం పూర్తి సహాయం అందించాలని నిర్ణయించారు. విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆసక్తికి తగ్గ కోర్సులను ఎంపిక చేయించారు.ఈ క్రమంలో పలు విద్యాసంస్థల యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపి, ఆ 31 మంది విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లు కల్పించినట్లు సమాచారం. తన విజ్ఞప్తిని గౌరవించి వెంటనే ముందుకు వచ్చిన విద్యాసంస్థలకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.పిఠాపురం నియోజకవర్గంలో విద్య, ఉపాధి, సామాజిక సంక్షేమ రంగాల్లో పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**జిల్లాలో పరిశ్రమల స్థాపన వేగవంతం చేయాలి**
**స్కిల్ డెవలప్‌మెంట్ లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలి**
**ప్రతి నియోజకవర్గంలో ఉద్యోగాల లక్ష్యాన్ని 1500కు పెంచాలి**
**పెండింగ్ పరిశ్రమల అనుమతులు త్వరితగతిన పూర్తి చేయాలి**
**"ఒక జిల్లా - ఒక ఉత్పత్తి"కు ప్రత్యేక ప్రాధాన్యం**
**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




**నంద్యాల, మే 13 :-**

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ పారిశ్రామికాభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (ఊ×జుూజ) సమావేశంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన, వివిధ సర్వేల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో అందించడంతో పాటు పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహక పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులకు ఆధునిక అవసరాలకు అనుగుణంగా వివిధ రంగాలలో సంవత్సరం వారీగా నైపుణ్య శిక్షణ అందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ప్రస్తుతం నిర్దేశించిన 900 ఉద్యోగాల లక్ష్యాన్ని 1500కు పెంచే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో సర్క్యులర్ ఎకానమీ ప్రాజెక్టులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు."ఒక జిల్లా - ఒక ఉత్పత్తి" కార్యక్రమం కింద బేతంచర్ల నాపరాయి సిమెంట్ మరియు పోర్ట్‌ల్యాండ్ సిమెంట్ ఉత్పత్తులను ప్రోత్సహించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం మొత్తం 14 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానం ద్వారా ఇప్పటికే 3 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన 11 దరఖాస్తులను సంబంధిత శాఖలు గడువులోపు పరిశీలించి అనుమతి ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహంలో భాగంగా పెట్టుబడి రాయితీలు, పావలా వడ్డీ, విద్యుత్ చార్జీల సబ్సిడీలు, పన్ను రాయితీలు వంటి ప్రభుత్వ ప్రోత్సాహకాల కింద జిల్లాలోని 10 పరిశ్రమల యూనిట్లకు రూ.81.62 లక్షల విలువైన రాయితీలను కమిటీ ఆమోదించినట్లు కలెక్టర్ వెల్లడించారు.పీఎం-సేతు (ూవీ-ూజుుఖ) పథకం కింద నంద్యాల ఐటీఐ కళాశాల అభివృద్ధికి రూ.240 కోట్లతో ప్రతిపాదించిన ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.120 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.79 కోట్లు భరించగా, మిగిలిన రూ.41 కోట్లు స్థానిక వనరుల ద్వారా సమీకరించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో డ్రాపౌట్ అయిన విద్యార్థులను గుర్తించి వారికి నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతుల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయికి పంపే స్కిల్ డెవలప్‌మెంట్ ప్రణాళికలను జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని తుది రూపు ఇవ్వాలని సూచించారు. కౌశలం మరియు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేల్లో తక్కువ హాజరు నమోదవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో 76 వేల మంది నమోదు చేసుకున్నప్పటికీ కేవలం 29 శాతం మాత్రమే హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**:ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై**

**:జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు తీవ్ర విమర్శలు**



**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మే 13 :**

జూపాడుబంగ్లా మండల పరిధిలోని తర్తూరు గ్రామ సమీపంలోని వీపనగండ్ల రస్తా వాగులో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీల సమస్యలను సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ నాయకులు బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు గ్రామ శాఖ కార్యదర్శి నవ్వసానితో కలిసి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే విధంగా చర్యలు తీసుకుంటోందని తీవ్రంగా ఆరోపించారు. ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ పేదలకు కల్పించాల్సిన హక్కులను నిర్వీర్యం చేస్తూ, గ్యారెంటీ ఉపాధిని గ్యారెంటీ లేకుండా మార్చారని విమర్శించారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న ధరలు, కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉపాధి కూలీలకు రోజుకు కనీసం రూ.600/- కూలీ చెల్లించాలని, సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేసవి కాలంలో తీవ్ర ఎండల మధ్య పనిచేస్తున్న కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక సమ్మర్ అలవెన్స్ ప్రకటించాలని కోరారు.గతంలో గడ్డపారకు రూ.5, మంచినీటికి రూ.2.50, గంపకు రూ.3 అదనపు చెల్లింపులు ఉండేవని, ప్రస్తుతం అవన్నీ రద్దు చేయడం వల్ల కూలీలు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పనుల ప్రదేశాల్లో తాగునీరు, నీడ, ప్రాథమిక వైద్య సదుపాయాలు, మెడికల్ కిట్లు వంటి కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.వేసవి తీవ్రత కారణంగా ఉపాధి కూలీలు వడదెబ్బలకు గురవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కూలీలు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ప్రతివారం చెల్లించడంతో పాటు పే స్లిప్పులు కూడా ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ నాయకురాలు ఎస్. నవ్వసాని, శ్రీరాములు, ఉపాధి కూలీలు శ్రీకాంత్, నారాయణ గౌడ్, షరీఫ్, నన్నే హుస్సేన్, మహేంద్ర, మద్దిలేటి, కర్ణమ్మ, లక్ష్మీదేవి, వరలక్ష్మి, కృష్ణవేణమ్మ, కళావతమ్మ తదితరులు పాల్గొన్నారు.







# అభయ ఆంజనేయస్వామి ప్రత్యేక పూజ

**: ఎద్దుల పంద్యాలు ప్రారంభించిన: ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మండల కన్వీనర్ మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి**

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మే 13:**

నందికొట్కూరు నియోజకవర్గంహనుమాన్ జయంతి పురస్కరించుకొని జూపాడుబంగ్లా మండలం కనకయ్య కొట్టాల గ్రామంలో శ్రీ అభయఆంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య, మరియు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఆరువంట ఎద్దుల పందాలను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో: నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి మరియు మండల నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ఎన్‌టిఎ వైఫల్యంతో విద్యార్థులకు శాపం !

కొందరు మాఫియాతో చేతులు కలపడం వల్లనే పేపర లీకేజీలు జరుగుతున్నాయి. వారిని గుర్తించాలి. కఠినంగా శిక్షించాలి. నీట్ పేపర్ దోషులకు కఠిన శిక్షలు పడితే తప్ప ఇలాంటి తప్పిదాలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ఒకప్పుడు టెన్త్ లేదా ఇంటర్ పరీక్ష పేపర్లు లీక్ అయితే సంబంధిత మంత్రి రాజీనామా చేసేవారు. అంతగా నైతిక బాధ్యత వహించేవారు. కానీ నీట్ పేపర్ లీక్ కావడం లక్షల మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రమాదంలో పడేసింది. దేశంలో వైద్య విద్య పట్టణ ప్రాంతాల్లోని ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారికే అందుబాటులో ఉంది. సామాన్యులు వైద్య విద్య చదివించడం దాదాపు అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రతి రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకోవడంతో ఇలాంటి బాధలు ఉండేవి కావు. నీట్‌ను తమిళనాడు అస్సలు ఒప్పుకోలేదు. కానీ 2017లో మోడీ ప్రభుత్వం కేంద్రీకరణ విధానాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఎను తీసుకొచ్చి, రాష్ట్రాల పరిధిలో ఉన్న వైద్య విద్య ప్రవేశార్హత నీట్ లో భాగం చేశారు. అన్ని పరీక్షలను తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలన్న మోడీ ప్రభుత్వ విధానంతో లీక్ లు, అవకతవకలు షరా మామూలుగా మారిపోయాయి. నీట్ విధానం అన్యాయమని, ఈ విధానాన్ని రద్దు చేసి, వికేంద్రీకరించాలని దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. దాదాపు 400 మందితో ఏర్పడిన ఎన్‌టిఎ నీట్ సహా 46 పరీక్షలను సమన్వయం చేయాల్సి ఉండటం, అందులోనూ అనర్హులు, అక్రమార్కులు భాగస్వాములు కావడం వల్ల ఇవాళ నీట్ పరీక్ష రద్దుకు కారణమయ్యింది. గతంలో నాలుగు సార్లు నీట్, ఒకసారి యుజిసి నెట్ లీక్ కావడమే ఇందుకు నిదర్శనం. 2024లో నీట్ యుజి పరీక్ష అవకతవకలపై బీహార్‌లో అరెస్టులు, సకాలంలో పేపర్ ఇవ్వక పోవడం వల్ల గ్రేస్ మార్క్ లు ఇవ్వాల్సి రావడం సహా ఎన్నో అంశాలు కలకలం రేపాయి. చర్చనీయాంశం అయ్యాయి. పూర్తి భద్రతా ప్రోటోకాల్ పాటించామని, జిపిఎస్ ట్రాక్ చేసిన వాహనాలు, ఎ.ఐ నియంత్రిత సిసి టివి, బయోమెట్రిక్, 5 జి జామర్లు వంటి చర్యలు తీసుకున్నామని ఎన్‌టిఎ చెబుతున్నా అక్రమాలు జరుగుతున్నాయంటే పేపర్ లీక్ మాఫియాను అరికట్టడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. విద్యార్థుల కలలను భగ్నం చేసే పేపర్ లీక్ లను అడ్డుకోకపోగా, కనీసం నోరుమెదపని ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటం సిగ్గుచేటు. పరీక్షా పే చర్చ అంటూ విద్యార్థులతో చర్చించే ప్రధానికి ఏటా జరుగుతున్న పేపర్ లీక్ లపై కనీసంగా మాట్లాడడం లేదు. అవిశ్రాంతంగా శ్రమించి ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు మరోసారి మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులపై ఆర్థిక భారం, అనిశ్చితితో శిక్ష అనుభవిస్తున్నారు. వ్యవస్థ ఇన్ని లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుంటే మోడీ ఇప్పుడు ఎందుకు మాట్లాడరన్నదే ప్రశ్న. నిజానికి నీట్ పరీక్షను తప్పించి ఆయా రాష్ట్రాలకు మునుపటి మాదిరి ఎంసెట్ నిర్వహించుకునే వెసలుబాటు కల్పిచడం మేలు. లేదా నీట్ వైఫల్యాలపై చర్యలు తీసుకోవాలి. సిబిఐ విచారణకు ఆదేశించినా అది ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కూడా అనుమానమే. పేపర్ లీక్ పై కేందప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి. బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి. విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ నెల 3వ తేదీన నిర్వహించిన నీట్ (యూజీ)-2026 పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించటం అనేక మంది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఇబ్బంది కలిగించే నిర్ణయమేనని చెప్పకతప్పదు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. పరీక్ష రద్దు నేపథ్యంలో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా ఈ అక్రమాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటాయి. అయితే, ఈసారి ఏజెంట్లు ఒకర్ని మించి మరొకరు సొమ్ము చేసుకునే ఉద్దేశంతో విచ్చలవిడిగా పేపర్‌ను అమ్మటంతో ఈ వ్యవహారం బయటపడింది.ఇలా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం కేవలం కేంద్ర వైఫల్యంగానే చూడాలి. వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణాలకు ఆలవాలంగా మారడం గర్హనీయం. ఈ నెల 3న జరిగిన నీట్ యుజి 2026 పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలడంతో పరీక్షను రద్దు చేసి, సిబిఐ విచారణకు జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆదేశించింది. పేపర్ లీక్, పరీక్ష రద్దుతో 22 లక్షల మంది విద్యార్థులు అనవసరమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షలకు 42 గంటల ముందే రాజస్థాన్‌లోని సీకర్‌లో వాట్సాప్ లో అందుబాటు లోకి వచ్చిన 'అంచనా పేపర్' లో కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో 120 నుంచి 140 ప్రశ్నలు నీట్ పరీక్షలో వచ్చాయంటే పరీక్ష నిర్వహణలో డొల్లతనం వెల్లడవుతుంది. ఈ పేపర్‌లోని ప్రశ్నలు ప్రిపేరైన విద్యార్థులు 720 మార్కుల్లో 600 వరకు స్కోర్ చేసి ఉండవచ్చన్నది నిపుణుల మాట. ఈ నెల 1 నుండి అంచనా పేపర్ అభ్యర్థులకు చేరిందని, రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకూ విక్రయించారని అధికారులు గుర్తించి, పలువురు నిందితులను అరెస్టు చేశారు. ఏదేమైనా ఇలాంటి విషయాల్లో కేంద్రం కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

# చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం

న్యూఢిల్లీ: పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా గత కొంతకాలంగా ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చమురు దిగుమతులపై ఆధారపడ్డ అనేక దేశాల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారతీయులు కూడా వృథా ఖర్చులు తగ్గించుకుని పొదుపు చర్యలను చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రధాని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని తన కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను సగానికి తగ్గించాలని ఆదేశించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అంతేకాకుండా, విద్యుత్ కార్ల వినియోగాన్ని పెంచాలని కూడా ప్రధాని సూచించినట్టు తెలుస్తోంది. మీడియా కథనాల ప్రకారం, కాన్వాయ్‌లోని కార్ల సంఖ్యను 50 శాతం మేర తగ్గించాలని ప్రధాని భద్రత దళం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌కు (ఎస్‌పీజీ) ఆదేశాలు అందాయి. భద్రతా ప్రోటోకాల్ పాటిస్తూనే పొదుపు చర్యలు చేపట్టాలని ఎస్‌పీజీకి సూచనలు వెళ్లినట్టు సమాచారం. ఈ దిశగా ఎస్‌పీజీ కార్యాచరణ మొదలెట్టినట్టు కూడా తెలుస్తోంది. తన కాన్వాయ్‌లో విద్యుత్ కార్ల సంఖ్యను పెంచేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించినట్టు తెలుస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న కార్లనే వినియోగించాలని, కొత్తవి కొనవద్దని కూడా ప్రధాని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇకపోతే హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకున్నట్లు వెల్లడించారు. ఇప్పుడున్న కాన్వాయ్‌లో దాదాపు సగం వరకు తగ్గించారని సమాచారం. ఇతర ప్రభుత్వ శాఖలు కూడా ఈ తరహా పొదుపు చర్యలకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తోంది. ఇంధన పొదుపు కోసం ఏయే చర్యలు తీసుకోవాలనే దానిపై పలు శాఖలు సమీక్షలు జరుపుతున్నాయి.

ఉత్తేజిత దినపత్రిక

# తిరుపతిని 'గ్లోబల్ టూరిస్ట్ హబ్'గా తీర్చిదిద్దుతాం: పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

**అన్నమయ్య, శ్రీపొట్టిశ్రీరాములు జిల్లలా పర్యాటక ప్రాజెక్టులపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష..ఇకపై ప్రతి మూడు నెలలకోసారి పర్యాటక శాఖపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడితిరుపతి సమీప ప్రాంతాలతో కొత్తగా 'టూరిజం సర్క్యూట్స్' ఏర్పాటు చేయాలని ఆదేశం.. అన్నమయ్య జిల్లాను 'ఎకనామిక్ డిస్ట్రిక్ట్'గా మార్చడమే లక్ష్యం.. నెల్లూరు తీరంలో అంతర్జాతీయ స్థాయి స్టార్ హోటళ్ల ఏర్పాటుకు సన్నాహాలుహార్సిలీహిల్స్ ఫెస్టివల్ నిర్వహణకు చర్యలు..జూలైలో మైపాడు బీచ్ ఫెస్టివల్ ను నిర్వహించాలని ఆదేశాలు జారీ.. మైపాడు బీచ్ కు బ్లూఫ్లాగ్ గుర్తింపు వచ్చేందుకు కృషి చేస్తామని వెల్లడి.. పర్యాటకుల భద్రత, బీచ్ పరిశుభ్రతపై మరింత దృష్టి పెట్టాలని సూచనపర్యాటక ఆస్తుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే నోటీసులు తప్పవని మంత్రి హెచ్చరిక**



**తిరుపతి, స్టాఫ్ రిపోర్టర్ ఉత్తేజితమే 13:**

ఆధ్యాత్మిక నగరం తిరుపతిని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'ఐకానిక్ గ్లోబల్ టూరిస్ట్ హబ్'గా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో జిల్లా పర్యాటక శాఖ అధికారులతో మంత్రి కందుల దుర్గేష్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి పరిసర ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించిన మంత్రి దుర్గేష్ పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను త్వరితగతిన పట్టాలెక్కించాలని సూచించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు ఇన్వెస్టర్లకు అవసరమైన భూములను కేటాయించడం, ఇప్పటికే కుదుర్చుకున్న ఎంవోయూల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ల్యాండ్ బ్యాంక్ వివరాలు, ఎగ్జిస్టింగ్ ప్రాపర్టీస్ మరియు కోర్టు కేసుల స్థితిగతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీపొట్టిశ్రీరాములు జిల్లాల పర్యాటక ప్రణాళికలను వివరించారు. కేవలం ఆధ్యాత్మికమే కాకుండా అన్నమయ్య జిల్లాను పర్యాటక రంగం ద్వారా ఆర్థికంగా ఎలా బలోపేతం చేయాలనే "ఎకనామిక్ మోడల్" పై చర్చించి దిశానిర్ధేశం చేశారు. హార్సిలీహిల్స్ ఫెస్టివల్ నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. విశాలమైన తీర ప్రాంతం ఉన్న శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరులో అంతర్జాతీయ స్థాయి స్టార్ హోటళ్లు, రిసార్టులు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైపాడు బీచ్ ఫెస్టివల్ ను జూలైలో నిర్వహిద్దామని తెలిపారు. మైపాడు బీచ్ కు బ్లూఫ్లాగ్ గుర్తింపు వచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, ఈ క్రమంలో బీచ్ లో పర్యాటకుల భద్రత, పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. త్వరలోనే సంబంధిత అధికారులు వచ్చి తనిఖీ చేస్తారని తెలిపారు. పర్యాటక రంగంలో జవాబుదారీతనం పెంచేందుకు ఇకపై ప్రతి మూడు నెలలకోసారి రివ్యూ సమావేశాలు నిర్వహిస్తామని మంత్రి దుర్గేష్ ప్రకటించారు. క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించడంతో పాటు, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్‌లో నిబంధనలు ఉల్లంఘించే వారికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక కళను చాటేలా అన్ని జిల్లాల్లో క్రమం తప్పకుండా పర్యాటక ఉత్సవాలు, ఫెస్టివల్స్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు మరియు వాటిని గడువులోగా పూర్తి చేయడంపై చర్చించారు. పర్యాటకులు స్థానిక సంస్కృతిని ఆస్వాదించేలా 'హోమ్ స్టే' మరియు 'బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్' వ్యవస్థను ప్రోత్సహించడం ద్వారా స్థానికులకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ డా. రమణ ప్రసాద్, డివిజనల్ మేనేజర్లు శ్రీనివాసరావు (తిరుపతి), జయదేవ్ (నెల్లూరు), జిల్లా పర్యాటక అధికారులు జనార్ధన్ రెడ్డి (తిరుపతి), నరేంద్ర (చిత్తూరు), నాగభూషణం (అన్నమయ్య), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం రాజు, ఆయా జిల్లాల యూనిట్ మేనేజర్లు, ప్రజా సంబంధాల అధికారి రవీంద్రారెడ్డి మరియు వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన బ్రిడ్జ్ పనులు పూర్తి..

**అండర్ బ్రిడ్జ్ కింద వాహనాల రాకపోకలు పునఃప్రారంభం... అధికారులను సత్కరించిన పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా...**

**రేణిగుంట ఉత్తేజిత మే 13.**



తిరుపతి జిల్లా రేణిగుంట మండల కేంద్రంలో గత నెల రోజులుగా సాగుతున్న వాహనదారుల కష్టాలకు ఎట్టకేలకు తెరపడింది. రైల్వే అండర్ బ్రిడ్జ్ మరమ్మతుల కారణంగా మూసివేయడంతో, రేణిగుంట పట్టణంలోకి రావాలంటే వాహనదారులు పాత రోడ్డు లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాల్సి వచ్చేది. అయితే ఆ మార్గాల్లో రోడ్లన్నీ గుంతలమయమై, ప్రయాణం నరకప్రాయంగా మారిందని అటు స్థానికులు, ఇటు తిరుమలకు వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ట్రాఫిక్ కష్టాలపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు పూర్తయి, తాజాగా అండర్ బ్రిడ్జ్ పునఃప్రారంభమైంది.

?శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి కృషితోనే ఈ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తయ్యాయని టీడీపీ నాయకులు కొనియాడారు. ప్రజలు, భక్తులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులకు, కాంట్రాక్టర్లకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. సుధీర్ రెడ్డి చొరవ వల్లే నెల రోజులుగా పడుతున్న కష్టాల నుండి వాహనదారులకు విముక్తి లభించిందని వారు తెలిపారు.

?ఈ సందర్భంగా రేణిగుంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ.. తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజా సౌకర్యాలకే తొలి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తాము అధికారులతో, కాంట్రాక్టర్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనులు త్వరగా పూర్తయ్యేలా చూశామన్నారు. అనంతరం, ప్రజా సమస్యను గుర్తించి సానుకూలంగా స్పందించి పనులు పూర్తి చేసిన అధికారులను మహబూబ్ బాషా మరియు ఇతర నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించి, వారి సేవలను కొనియాడారు.

?ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్, ఎంపీడీవో రవిచంద్ర, సిఐ జయచంద్ర, రేణిగుంట మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ నాయకులు డి.పి. పుష్పనాథం, ముస్లిం మైనార్టీ నాయకులు నవాబు, యువ నాయకుడు విద్యాసాగర్, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అండర్ బ్రిడ్జ్ తెరుచుకోవడంతో వాహనదారులు, పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

# 12వ తరగతి సీబీఎస్ఈ ఫలితాలలో మంగళ్ విద్యాలయం విద్యార్థుల ప్రభంజనం

**తిరుపతి ఉత్తేజిత మే 13:**




పూతలపట్టు మండలం పేటమిట్టలోని మంగళ్ విద్యాలయం విద్యార్థులు ఈరోజు విడుదలైన 12వ తరగతి సీబీఎస్ఈ ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచి 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. వివిధ గ్రూపులలో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి సత్తాచాటారు.పి.సి.ఎం గ్రూపులో 500 మార్కులకు గాను ఇ. ఉదయశ్రీ 470 మార్కులతో మొదటి స్థానం సాధించగా, జి. వెంకి 468 మార్కులు, వి. శశాంక్ 462 మార్కులు సాధించారు.అదేవిధంగా పి.సి.ఎం.బి గ్రూపులో బి. మొనితా చౌదరి 423 మార్కులు సాధించగా, పి.సి.బి గ్రూపులో డి. కృష్ణ హరిణి 411 మార్కులు సాధించారు.

కామర్స్ గ్రూపులో జె. రుష్మిత 468 మార్కులు సాధించగా, ఎం.ఇ.సి గ్రూపులో బి. అక్షయ రెడ్డి 444 మార్కులు సాధించి ప్రతిభ చాటారు.

ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభపై అమరరాజా విద్యాసంస్థల వ్యవస్థాపకులు గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి హర్షం వ్యక్తం చేశారు. అలాగే రాజన్న ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్, ప్రిన్సిపాల్ ధనంజయ నాయుడు విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# బాధిత కుటుంబాలకు బొజ్జల సుధీర్ రెడ్డి పరామర్శ

**రేణిగుంట ఉత్తేజిత మే 13.**





శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బుధవారం రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు.


?తిమ్మయ్యగుంటలో నివాళి

ముందుగా రేణిగుంట మండలం, వెంకటాపురం పంచాయతీ పరిధిలోని తిమ్మయ్యగుంట గ్రామానికి వెళ్లిన సుధీర్ రెడ్డి, సీనియర్ నాయకులు మాధవరెడ్డి కోడలు దివంగత గాయత్రి రెడ్డి కర్మక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు. గాయత్రి రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన ఆయన, మాధవరెడ్డి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు.

?సుధాకర్ రెడ్డి కుటుంబానికి ధైర్యంఅనంతరం ఏర్పేడు మండలం, చిన్న అంజిమేడు గ్రామంలో దివంగత చిత్తానూరు సుధాకర్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుధాకర్ రెడ్డి మరణం తీరని లోటని పేర్కొంటూ, పుట్టెడు దుఃఖంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

# పలుకే బంగారమాయినా..?

**అమరావతి, మే 13**




ః కార్యకర్తల కృషితో మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదనే భావన ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ధన, మాన, ప్రాణాలకు తెగించి పోరాడి టీడీపీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చిన కార్యకర్తలు.. ఇప్పుడు తమ పట్ల పార్టీ వ్యవహరిస్తున్న తీరు చూసి ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్న తీరును చూసి.. ఎన్నికలకు ముందు ఉన్న వీళ్లు.. వీళ్లేనా..? అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు జగన్‌పై పోరాటం చేస్తున్న కార్యకర్తలకు, సానుభూతిపరులకు ఎమ్మెల్యేలు అండదండలు అందించారు. వారు ఏమి అడిగినా.. "ఇంకేముంది.. అధికారంలోకి రానీయండి.. మిమ్మల్ని నెత్తిన పెట్టుకుంటాం" అంటూ హామీలు ఇచ్చారు.అంతేనా.. కార్యకర్తలు కనిపిస్తే వారిని వాటేసుకుని, రాసుకుపూసుకుని తిరిగారు. నియోజకవర్గంలో పర్యటించినప్పుడు వారికి ఎన్నో హామీలు ఇచ్చారు. "జగన్ పార్టీ నాయకుల కంటే.. మనమే ఎక్కువ పనులు చేసుకుందాం.. గెలిస్తే మనదే రాజ్యం" అంటూ వారిని ఊహల పల్లకిలో ఊరేగించారు. వారు అడగక ముందే ధనసహాయం చేశారు. ఎక్కడైనా ఇబ్బంది ఉందని తెలిసినా.. అక్కడికి వెళ్లి ఎంతో కొంత భరోసా ఇచ్చేవారు. కార్యకర్తలే తమ ప్రాణమని, వారి కంటే ఇంకేమీ లేదన్నట్లు వ్యవహరించారు.అప్పట్లో వారి తీరు చూసి టీడీపీ కార్యకర్తలు అబ్బురపడ్డారు. "ఇలాంటి నాయకులు అధికారంలోకి వస్తే ఇక పార్టీకి తిరుగేలేదు" అని భావించారు. కానీ ఇప్పుడు వారి వ్యవహారం చూసి.. "అసలు వీళ్లు వాళ్లేనా..?" అంటూ ఆశ్చర్యపోతున్నారు.ఇంతకు ముందు అవసరం లేకపోయినా తమ చుట్టూ తిరిగిన నేతలు.. ఇప్పుడు అవసరం ఉండి వారి గుమ్మం తొక్కినా.. "వీళ్లు ఎవరో తెలియదు" అన్నట్లు వ్యవహరిస్తున్నారని కార్యకర్తలు వాపోతున్నారు. కనీసం ఎమ్మెల్యే ముందు నిల్చున్నా పలకరించడానికి కూడా మనసు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలకరిస్తే.. "ఏమవుతుందో.. ఏమి అడుగుతారో.. ఏ పని చెప్పమంటారో.." అన్నట్లు మొహం తిప్పుకుంటున్నారని విమర్శిస్తున్నారు. అందరూ అలా కాదని.. కానీ చాలా నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.బాపట్ల జిల్లాలో తొలిసారి గెలిచిన ఎమ్మెల్యే తీరు మరీ దారుణం..!

బాపట్ల జిల్లాలో తొలిసారి గెలిచిన ఓ ఎమ్మెల్యే తీరు మరీ దారుణంగా ఉందని పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఈ నాయకుడు అడిగిన వారికి, అడగని వారికి సొమ్ములు గుమ్మరించారని చెబుతున్నారు. పార్టీ అగ్రనాయకత్వాన్ని ప్రసన్నం చేసుకుని ఎన్నికలకు రెండేళ్ల ముందే పార్టీ టికెట్ ఖరారు చేసుకున్న ఆయన.. ఆ తరువాత నియోజకవర్గంలో ఇళ్లు ఇళ్లూ తిరిగారని గుర్తు చేస్తున్నారు.కార్యకర్తలంటే తనకు ప్రాణమని, పార్టీ అంటే దైవమన్నట్లు వ్యవహరించారని చెబుతున్నారు. ప్రతి ఒక్కరికీ ఎన్నో హామీలు ఇచ్చారని, పార్టీ కార్యకర్తలు తన ఆత్మబంధువులన్నట్లు వ్యవహరిస్తూ ఎన్నికల వరకు వారితో పనిచేయించుకున్నారని అంటున్నారు. ఆయనను నమ్మిన కార్యకర్తలు ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పనిచేసి అఖండ మెజార్టీతో గెలిపించుకున్నారని చెబుతున్నారు.టీడీపీ ఆవిర్భావం తరువాత ఒకటి రెండు సార్లు మాత్రమే గెలిచిన ఆ నియోజకవర్గంలో పార్టీ గెలవడం అంత ఆషామాషీ విషయం కాదని, అదంతా కార్యకర్తలు, సానుభూతిపరుల కృషి వల్లే సాధ్యమైందని అంటున్నారు. ఇది పార్టీకి, గెలిచిన ఎమ్మెల్యేకి కూడా తెలుసని చెబుతున్నారు.

# టీటీడీలో స్థానిక రిజర్వేషన్ల సాధనే లక్ష్యం..

**తిరుపతి ఉత్తేజిత మే 13.** డీఎంసీ భాస్కర్ పిలుపు



తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో జరుగుతున్న అన్యాయంపై తిరుపతి స్థానిక రిజర్వేషన్ పోరాట సమితి పోరాటాన్ని ఉధృతం చేసింది. ఈ మేరకు సమితి నాయకులు డీఎంసీ భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేస్తూ, తిరుమల, తిరుపతి మరియు తిరుపతి రూరల్ వాసుల మద్దతు కోరారు.

?దశాబ్దాల నాన్-లోకల్ ఆధిపత్యం:

1975వ సంవత్సరం నుండి టీటీడీలో స్థానికేతరుల (నాన్-లోకల్) ఆధిపత్యం పెరిగిపోయిందని భాస్కర్ విమర్శించారు. ఉన్నత స్థాయి అధికారులు మొదలుకొని కింది స్థాయి సిబ్బంది వరకు బయటి వ్యక్తులే వ్యవస్థలో పాతుకుపోయారని ఆయన ఆరోపించారు. దీనివల్ల స్థానిక నిరుద్యోగులు తమ హక్కులను కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

?రాజకీయ కుమ్మక్కుపై విమర్శలు:

గత కొన్ని దశాబ్దాలుగా స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై స్థానికులకు దక్కాల్సిన అవకాశాలను పక్కదారి పట్టించారని భాస్కర్ పేర్కొన్నారు. అపరిమితమైన అధికారం, ఆర్థిక బలం ఉన్న అటువంటి శక్తులపై పోరాటం చేయడం సామాన్యమైన విషయం కాదని, కానీ స్థానికుల భవిష్యత్తు కోసం ఈ పోరాటం అనివార్యమని ఆయన స్పష్టం చేశారు.

?పోరాట ఉద్దేశం:

టీటీడీలో నాన్-లోకల్ అధికార వ్యవస్థను పూర్తిగా తొలగించి, స్థానిక యువతకు రిజర్వేషన్లు కల్పించడమే ఈ పోరాట సమితి ప్రధాన డిమాండ్.

?ప్రజల మద్దతు కోరుతూ:

ఈ రిజర్వేషన్ల పోరాటంలో తిరుపతి ప్రాంత ప్రజలందరూ భాగస్వాములు కావాలని, తమ ఆశీస్సులు అందించాలని భాస్కర్ విజ్ఞప్తి చేశారు. అందరూ ఏకమై అడుగులో అడుగు వేస్తేనే టీటీడీలో స్థానికులకు న్యాయం జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఉత్తమ జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు.. రూ.3 లక్షల వరకు నగదు




విజయవాడ, మే 13: జర్నలిజం రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన మీడియా ప్రతినిధులకు 2025-26 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక అవార్డులను ప్రదానం చేయనుంది. ఈ విషయాన్ని ఆలపాటి సురేశ్ కుమార్ వెల్లడించారు. స్థానిక సి.ఆర్. మీడియా అకాడమీ కార్యాలయంలో సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

అవార్డుల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు

జర్నలిస్టుల అవార్డుల ఎంపిక, ప్రదానానికి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించిందని ఆలపాటి సురేశ్ కుమార్ తెలిపారు. ఈ కమిటీలో ఇండియా టుడే మాజీ ఎడిటర్ ఏ.ఏ.వి. ప్రసాద్, ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ డి.వి.ఆర్. మూర్తి, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్యన్నారాయణ మూర్తి సభ్యులుగా ఉంటారని తెలిపారు. సమాచార శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు.

రూ.3 లక్షల వరకు నగదు బహుమతులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో జారీ అయిన ఉత్తర్వుల ప్రకారం మొత్తం 12 అవార్డులను ఇవ్వనున్నట్లు చైర్మన్ వెల్లడించారు. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు రూ.3 లక్షలు, ఉత్తమ జర్నలిస్టు మరియు ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డులకు రూ.2 లక్షలు చొప్పున నగదు బహుమతి అందజేయనున్నారు. మిగిలిన అవార్డులకు రూ.1 లక్ష చొప్పున ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. కొన్ని అవార్డులను కమిటీ విచక్షణతో ఎంపిక చేయగా, మరికొన్నింటికి దరఖాస్తులు స్వీకరించి అర్హులను ఎంపిక చేస్తామని చెప్పారు.

2017 తర్వాత మళ్లీ జర్నలిస్టుల అవార్డులు

సమాచార శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ మాట్లాడుతూ, ప్రతి ఏడాది జర్నలిస్టుల అవార్డులు అందించేలా ప్రభుత్వం సంకల్పించిందన్నారు. 2017 తర్వాత మళ్లీ 2025-26 సంవత్సరానికి ఈ అవార్డుల ప్రక్రియను పునరుద్ధరించడం ఆనందంగా ఉందన్నారు. ఒక వారం రోజుల్లో అధికారిక ప్రకటన విడుదల చేసి, జూలై నెలలో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.జర్నలిస్టుల అవార్డులకు కనీస అనుభవం మాత్రమే ప్రమాణంగా పరిగణిస్తామని, అక్రిడిటేషన్‌తో సంబంధం లేదని ఆలపాటి సురేశ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సి.ఆర్. మీడియా అకాడమీ కార్యదర్శి వి. మణిరాం, జాయింట్ డైరెక్టర్ ఐ. సూర్య చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# రేణిగుంట విమానాశ్రయం నందు గిడుగు రుద్రరాజుకు ఘన స్వాగతం...

**రేణిగుంట ఉత్తేజిత మే 13.**




తిరుపతి పర్యటన నిమిత్తం విమానాశ్రయానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ, సిడబ్ల్యూసి మెంబర్ గిడుగు రుద్రరాజుకు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు సాదరంగా ఆహ్వానం పలికారు.

?ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేందర్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుద్రరాజుకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు.

# టూత్‌పేస్ట్‌తో పళ్లేకాదు.. ఇవి కూడా మెరిపించేయండి..!




మన పళ్లను తళతళ మెరిపించడమే కాదు.. ఇంకా చాలా పనులే చేస్తుంది. టూత్‌పేస్ట్ ఇంకా ఎన్ని రకాలుగా వాడుకోవచ్చు.. ఏమి శుభ్రం చేయడానికి ఉపయోగ పడుతుందో ఈ స్టోరీలో చూద్దాం. కొన్నిసార్లు అనుకోకుండా కాఫీ కప్పు చేయి జారి.. నేలపై పడితే ఈజీగానే శుభ్రం చేసుకోవచ్చు. కానీ, అవి గోడ మీద పడితేనే.. ఆ మరకలను తొలగించడం చాలా కష్టం. ఈ మరకలను తొలగించడానికి టూత్‌పేస్ట్ ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. గోడపై టూత్‌పేస్ట్ మరకలను తొలగించడానికి.. టూత్‌పేస్ట్‌ను మరకలపై అప్లై చేసి రుద్దండి. అలా కొన్ని నిమిషాలు వదిలేసి.. ఆ తర్వాత తడి క్లాత్‌తో తుడవండి. ఇలా చేస్తే మరకలు మాయం అవుతాయి. వెండి సామన్లు క్లీన్ చేయడానికి చాలా కష్టపడుతుంటారు. టూత్‌పేస్ట్‌తో వెండి సామాన్లను తళతళ మెరిపించవచ్చు. టూత్‌పేస్ట్‌ను వెండి సామాన్లకు అప్లై చేసి.. ఆ తర్వాత తడి చేసుకుంటూ బ్రష్‌తో రుద్దండి. ఆ తర్వాత నీళ్లతో శుభ్రం చేయండి. ఇలా చేస్తే.. వెండి సామాన్లు నలుపు పోయి.. మంచిగా మెరుస్తాయి.

తెల్ల షూస్ త్వరగా మాసిపోతాయ్. వీటిని పూర్వస్థితికి తీసుకురావడం కాస్త కష్టమనే చెప్పాలి. మీ వైట్ షూస్ తిరిగి మెరవాలంటే.. టూత్ పేస్ట్ సహాయపడుతుంది. చెంచా చొప్పున వైట్ టూత్‌పేస్ట్, బేకింగ్ సోడా తీసుకొని, కొద్దిగా నీటిని కలిపి మరకలు ఉన్న చోట రాయండి. నీటితో తడి చేసుకుంటూ బ్రష్‌తో రుద్ది, ఆపై తడి వస్త్రంతో తుడిస్తే కొత్తవాటిలా మెరుస్తాయి. ఫోన్ ట్రాన్స్‌పరెంట్ కవర్లు.. కొన్ని రోజుల తర్వాత పసుపు రంగులోకి మారతాయి. వాటిని తిరిగి మెరిపించడానికి.. టూత్‌పేస్ట్ సహాయపడతాయి. మీ ఫోన్ కవర్ మీద.. దాని మీద కొన్ని నీళ్లను చిలకరించి, తెల్లని పేస్టుతో రుద్ది కాసేపు అలా వదిలేయండి. తర్వాత నీటితో శుభ్రం చేస్తే కొత్తదానిలా కనిపిస్తుంది.

# ఈ 3 పనులు చేసేవారికి త్వరగా ముసలితనం వస్తుందట..











ఎన్ని ఏళ్ళొచ్చినా యంగ్‌గా కనిపించాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ, తెలిసీతెలియక చేసే కొన్ని తప్పుల వల్ల త్వరగా ముసలివారైపోతారట.. అవేంటో తెలుసుకోండి. ఈ 3 పనులు చేసేవారికి త్వరగా ముసలితనం వస్తుందట..వయసు పెరుగుతుందంటే ఎవరికైనా అందంగా కనిపించే విషయంలో కాస్తా భయమే ఉంటుంది. అందుకే ఎప్పుడు కూడా చిన్నవారిగానే కనిపించేందుకు యంగ్ లుక్‌ని ఇచ్చే క్రీమ్స్, ప్రోడక్ట్స్ వాడడం, మంచి డైట్, ఎక్సర్‌సైజ్ చేయడం వంటి ఫాలో అవుతారు. తమని తాము చిన్నవారిలా చూసుకునేందుకు ఆరాటపడతారు. కొన్ని తప్పులు చేయకుండా ఉండాలి. అవేంటో తెలుసుకోండి.

ఎక్కువగా పని.. సామర్థ్యానికి మించిన పని చేయడం వల్ల త్వరగా వృద్ధాప్య ఛాయలు కనిపించేలా చేస్తాయని చెబుతున్నారు నిపుణులు. ఏ పని అయినా పట్టుదలతో పాటు క్రియేటివిటీగా చేస్తే త్వరగా పనులు పూర్తవ్వడమే కాకుండా శ్రమ తగ్గుతుంది. కాబట్టి, స్మార్ట్‌గా ఆలోచించి అలా పనిచేయడం చాలా ముఖ్యం. అతిగా తినడం.. మనం ఆరోగ్యంగా ఉండడానికి ఆహారం ఎంత ముఖ్యమో, అందంగా కనిపించడంలోనూ డైట్ అంతే కీ రోల్ పోషిస్తుంది. ఆహారం ఎంత తినాలో తెలిసి ఉండడం చాలా ముఖ్యం.

ఫుడ్ ఎక్కువగా తిన్నా, తక్కువగా తిన్నా అంత మంచిది కాదు. ముఖ్యంగా ఎక్కువగా తిన్నామంటే బరువు పెరిగి త్వరగా ముసలి వారిలా కనిపిస్తారని చెబుతున్నారు నిపుణులు.


నిద్ర.. ఇది కూడా త్వరగా ముసలివారిలా కనిపించేలా చేస్తుంది. ఎక్కువగా నిద్ర పోయినా, అసలే నిద్రలేకపోవ దం వల్ల అకాల వృద్ధాప్యం వస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే నిద్రసరిగ్గా ఉండేలా చూసుకోండి.

చివరిగా.. వృద్ధాప్యం అనేది ప్రతి ఒక్కరి జీవితంలో వస్తుంది. దానికి కంగారు పడాల్సిన అవసరం లేదు. కానీ, మనసులో ముసలితనం వచ్చినట్టుగా ఫీల్ అయితే వయసులో కూడా ముసలివారిలానే ఫీల్ అవుతారు. కాబట్టి, థింక్ యంగ్.. స్టే యంగ్..

# గ్యాస్, ఎసిడిటీ సమస్యలు రావు..!







ఈ రోజుల్లో పని ఒత్తిడిని తట్టుకోవాలంటే.. ఏడాదికి ఒకసారైనా టూర్లకు వెళ్లాల్సి ఒదే. తెలియని ప్రదేశాలకు వెళ్తే.. మనలో తెలియని ఉత్సాహం నిండుతుంది. ఈ రోజుల్లో చాలామంది గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలతో ఇబ్బంది పడుతు న్నారు. ఇలాంటి వారు టూర్స్‌కు వెళ్లినప్పుడు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారు. జీర్ణ సమస్యల వల్ల.. టూర్ కూడా సరిగ్గా ఎంజాయ్ చేయలేరు. విహారయాత్రకు వెళ్లేవారు.. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యలు ఉండవని నిపుణులు అంటున్నారు. బ్రేక్‌ఫాస్ట్ తక్కువ గా తినండి..కొంతమంది బ్రేక్‌ఫాస్ట్ హెవీ గా తింటూ ఉంటారు. టూర్లకు వెళ్లినప్పు డు హెవీగా తింటే.. రోజంగా హెవీగా, ఇబ్బందిగా అనిపిస్తుంది. దీంతో, ఏ పనీ సరిగ్గా చేయలేరు. బ్రేక్‌ఫాస్ట్ తక్కువగా తిన్నా.. త్వరగా నీరసం వచ్చేస్తుంది. మీరు టూర్‌లో ఉన్నప్పుడు మీ బ్రేక్‌ఫాస్ట్‌లో నట్స్, డ్రై ఫ్రూట్స్ వంటి బలవర్ధకమైన ఆహారం చేర్చుకోండి. ఇలా చేస్తే.. రోజంతా యాక్టివ్‌గా ఉంటారు.

ఫ్రెష్ ఫుడ్ తినొచ్చు.. కొంతమంది టూర్లకు వెళ్లినప్పుడు.. లోకల్ ఫుడ్ తినడానికి జంకుతారు. అవి పడకపోతే.. హెల్త్ పాడవుతుందని అనుకుంటూ ఉంటారు. అయితే తాజాగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదంటున్నారు నిపుణులు. ఒకేసారిగా కాకుండా.. మితంగా ఎక్కువసార్లు తింటే మంచిది.

ఇంటి నుంచి తీసుకెళ్లండి.. కొంతమందికి బయట ఫుడ్ పడదు. కాబట్టి, ఇంటి నుంచే కొన్ని రకాల పదార్థాలను తీసుకెళ్లడం మంచిదంటున్నారు నిపుణులు. ఒకవేళ బయట ఫుడ్ తిన్నా.. ఒకేసారి ఎక్కువగా కాకుండా తక్కువ మొత్తంలో ఎక్కువసార్లు తింటే ఎలాంటి సమస్యా ఉండదు. కొంతమంది అజీర్తి సమస్యలతో టూర్ ఎంజాయ్ చేయలేరు. ఇలాంటి వారు వారి డైట్‌లో పెరుగు తప్పకుండా తీసుకోవాలి. అలాగే శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం కోసం క్రమం తప్పకుండా నీళ్లు తాగుతుండాలి.

# కాలి గోర్ల చివర్లలో నొప్పి, వాపుగా ఉందా..











చాలా మందికి కాలి బొటనవేళ్ళల్లో నొప్పిగా ఉంటుంది. చివర్లకి వాపు వచ్చి నొప్పిగా అనిపిస్తుంది. దీనికి గోళ్ళ ఫంగస్ కారణం. మరి దీనికి ఎలాంటి టిప్స్ పాటించాలో ఇప్పుడు చూద్దాం. నెయిల్ ఫంగస్. గోర్లలో ఫంగస్ కారణంగా చాలా సార్లు సమస్య వస్తుంది. దీంతో వేళ్ళలో నొప్పి ప్రారంభమవుతుంది. అది అలానే కొనసాగితే గోర్ల ఆకృతి, రంగు కూడా మారుతుంది. దీనికి చక్కని ఇంటి చిట్కాలు ఉన్నాయి. వీటిని ఫాలో అయితే సమస్య చాలా త్వరగా తగ్గిపోతుంది. కారణాలు.. గోర్ల నొప్పి, పుండ్లు కావడానికి కొన్నిసార్లు సరిగా క్లీన్ చేయకపోవడం, ఇన్ గ్రోన్ టో నెయిల్స్ కారణంగా సమస్య వస్తుంది. చాలా మంది ఈ సమస్యతో బాధపడుతుంటారు. దీని వల్ల నొప్పి ఇబ్బందిగా ఉంటుంది. ఈ సమస్యని ఇంట్లోనే తగ్గించుకోవచ్చు. అవేంటో తెలుసుకోండి.

యాపిల్ సైడర్ వెనిగర్.. ఇందులో ఎక్కువగా యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. కాస్తా నీటిలో యాపిల్ సైడర్ వెనిగర్ వేసి అందులో పాదాలని ఉంచండి. ఎసిటిక్ యాసిడ్ అనే సమ్మేళనం ఏండే ఈ వెనిగర్ మీ యాసిడ్ ఇన్ఫెక్షన్ వ్యాప్తిని తగ్గించడంలో హెల్ప్ అవుతుంది. దీని వాసనని తట్టుకోలేని వారు ఏదైనా ఎసెన్షియల్ ఆయిల్ కలపొచ్చు.

బ్లాక్ టీ.. గోళ్ళ ఫంగస్ సమస్యని దూరం చేసేందుకు బ్లాక్ టీ కూడా టానిక్‌లా పని చేస్తుంది. ఇది గోళ్ళ ఫంగస్, ఇన్ఫెక్షన్ పెరుగుదలని తగ్గించడంలో హెల్ప్ చేస్తుంది. దీని కోసం మీరు డీకాషన్ తయారు చేసి అది గోరువెచ్చగా అయ్యాక కాళ్ళని అందులో నానబెట్టండి.

వెల్లుల్లి.. వెల్లుల్లి శక్తివంతమైన యాంటీ మైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇందులో అలిసిన్ అనే యాంటీ ఫంగల్ ఏజెంట్ ఉంది. దీనిని నేరుగా దంచి పెట్టడం లేదా రసం రాయండి. అరగంట అలానే ఉంచి తర్వాత క్లీన్ చేయండి.

బేకింగ్ సోడా.. బేకింగ్ సోడా ఫంగస్‌కి కారణమయ్యే తేమని గ్రహించగలదు. బేకింగ్ సోడాను కొద్దిగా నీటితో కలిపి పేస్టులా చేయండి. దీనిని ఇన్‌గ్రోన్ గోర్ల చుట్టూ రాయండి. 15 నుండి 20 నిమిషాల పాటు ఉంచి తర్వాత గోరువెచ్చని నీటితతో క్లీన్ చేయండి.

నిమ్మరసం.. అనేక రకాల ఆరోగ్య సమస్యలకి పరిష్కారమని చెప్పొచ్చు. ఇన్ఫెక్షన్లని దూరం చేయడానికి నిమ్మరసం బాగా పనిచేస్తుంది. నిమ్మరసాన్ని రాయడం వల్ల సమస్య చాలా వరకూ తగ్గుతుంది.

# యాంటీ ఆక్సిడెంట్ రిచ్ డైట్..









రోజంతా అలసటగా అనిపిస్తుందా..? ఎలాంటి కారణంగా లేకుండాకండరాలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారా..? మీ చర్మం నిర్జీవంగా మారిందా..? నీరసంగా, నిస్సత్తువగా ఉంటుందా..? మీ సమాధానం అవునూ అయితే.. మీ ఆహారంలో యాంటీఆక్సిడెంట్లను ఎక్కువగా తీసుకోవాలి. యాంటీఆక్సిడెంట్లు.. మీ శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి రక్షించడానికి సహాయపడతాయి. మనం రోజూ తీసుకునే ఆహారం ద్వారా ఉత్పత్తి అయ్యే టాక్సిన్స్, ఆక్సిడెంట్లను బయటకు పంపడంలో యాంటీఆక్సిడెంట్లు కీలక పాత్ర పోషిస్తాయి. మన శరీరంలో వ్యర్థాలు ఎక్కువగా పేరుకుంటే.. ఇమ్యూనిటీ వీక్ అవుతుంది, ఆరోగ్యం క్షీణిస్తుంది. అందుకే, మన డైట్‌లో యాంటీఆక్సిడెంట్ రిచ్ ఆహారం తీసుకోవాలని నిపుణులు అంటున్నారు. యాంటీఆక్సిడెంట్ వల్ల టాక్సిన్స్‌ను తొలగిస్తుంది.. హార్వర్డ్ మెడికల్ స్కూల్ ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం శరీరంలో పేరుకున్న టాక్సిన్స్‌ను తొలగిస్తుంది. యాంటీఆక్సిడెంట్లు తమ స్వంత ఎలక్ట్రాన్‌లను దానం చేసి.. ఫ్రీ రాడికల్స్‌ను న్యూట్రల్ చేస్తుంది. ఈ ప్రక్రియ మీ శరీర కణాలలోని.. ఇతర అణువులకు హాని కలిగించే.. ఆక్సిడెంట్ల గొలుసు ప్రతిచర్యను విచ్ఛిన్నం చేస్తుంది.

శక్తిని మెరుగుపరుస్తుంది.. ఇది శరీరాన్ని డిటాక్స్ చేసి.. శరీర సామర్థ్యాన్ని పెంచుతుంది. ఇది మీ శరీరానికి శక్తిని అందిస్తుంది. జర్నల్ ఆఫ్ క్లినికల్ బయోకెమిస్ట్రీ న్యూట్రిషన్‌లో ప్రచురించిన పరిశోధన ప్రకారం, యాంటీఆక్సిడెంట్-రిచ్ ఫుడ్స్ తీసుకోవడం వల్ల "ఏరోబిక్ గ్లూకోజ్ మెటబాలిజం" ద్వారా శక్తి ఉత్పత్తిని పెంచవచ్చు.

గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.. యాంటీఆక్సిడెంట్లు.. శరీర కణాలను నాశం చేసే ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తుంది, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గిస్తుంది. ఇది ధమనుల ద్వారా రక్తం, ఆక్సిజన్ ప్రవాహాన్ని మెరుగుపరుస్తుందని, గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుందని.. అధ్యయనాలు చెబుతున్నాయి.

చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి.. యాంటీఆక్సిడెంట్లు.. చర్మాన్ని సూర్యరశ్మి నుంచి రక్షిస్తాయి. మీ కణాలలో రక్త ప్రసరణను పెంచుతాయి, చర్మ తేమను నిర్వహిస్తాయి. యాంటీఆక్సిడెంట్లు.. వృద్ధాప్య ఛాయలు తర్వగా రాకుండా అడ్డుకుంటాయి.

కంటి చూపును రక్షిస్తాయి.. పీర్ - రివ్యూడ్ జర్నల్ ప్రకారం ఆకుపచ్చ కూరగాయలలో ఉండే.. లుటిన్, జియాక్సింతిన్ వంటి పోషకాలు యాంటీఆక్సిడెంట్‌లుగా పనిచేస్తాయి. ఇవి కంటి సంబంధిత సమస్యల ముప్పును తగ్గిస్తాయని నిపుణులు అంటున్నారు. విటమిన్ సి, ఇ కూడా యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. ఇవి కంటి సమస్యలను నివారిస్తాయి.

ఈ ఫుడ్స్‌లో ఉంటాయి.. యాంటీ ఆక్సిడెంట్లు ఆహారం ద్వారానే వస్తాయి. ఆకు కూరలు, కాయగూరలు, పండ్లలోనే ఇవి లభిస్తాయి. యాంటీఆక్సిడెంట్లు.. ఎక్కువగా క్యారెట్, క్యాబేజీ, టమాట, ఉల్లి, దుంపలు, బీన్స్, చిక్కుళ్లు, యాపిల్, దానిమ్మ, ద్రాక్ష, బొప్పాయి, గ్రీన్ టీ, ఆలీవ్ ఆయిల్, తెనే లాంటి వంటి ఆహార పదార్థాల్లో ఎక్కువగా కనిపిస్తాయ్.

# బొప్పాయి జ్యూస్ తాగితే ఈ లాభాలన్నీ పక్కా..









బొప్పాయి పండు ఆరోగ్యానికి హెల్ప్ చేస్తుంది. దీనిని తాగడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. అవేంటో తెలుసుకోండి. రోజూ బొప్పాయి జ్యూస్ తాగితే ఈ లాభాలన్నీ పొందడం పక్కా.. పిల్లల నుంచి పెద్దల వరకూ ఇష్టపడే పండ్లలో బొప్పాయి పండు ఒకటి. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ బొప్పాయి రసాన్ని 30 నుండి 50మిల్లీ లీటర్ల వరకూ రోజూ తీసుకుంటే కొన్ని లాభాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు నిపుణులు.

హెల్త్ బెనిఫిట్స్.. బొప్పాయి పండులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల ఆకలి కంట్రోల్ అవుతుంది. దీంతో బరువు తగ్గుతుంది. దీంతో పాటు జీవక్రియని మెరుగ్గా చేస్తుంది. ఇది ముఖ్యంగా పిల్లల్లో కడుపులోని పురుగులని చంపుతుంది. దీంతో పాటు చాలా లాభాలు ఉన్నాయి.

పీరియడ్ పెయిన్స్.. బొప్పాయిలో గర్భాశయంలోని వ్యర్థాలు, ట్యాక్సిన్స్‌ని బయటకు పంపే శక్తి ఉంది. ఇది రుతుస్రావం సమయంలో వ్యర్థాలను బయటకు పంపుతుంది. కడుపు నొప్పిని తగ్గిస్తుంది. గర్భం దాల్చాలనుకునే మహిళలు దీనికి దూరంగా ఉంటే చాలా మంచిది. దీనిని రోజుకి 30 మిల్లీగ్రాముల వరకూ తీసుకోవచ్చు. ఇందులో హార్మోన్ల అసమతుల్యతని కూడా హెల్ప్ చేస్తుంది.

బొప్పాయిలో విటమిన్ ఎతో పాటు యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్లేవనాయిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నాయి. కాబట్టి, జ్యూస్‌ని తక్కువగా మోతాదులో ఉంటాయి. ముఖ్యంగా పురుషుల్లో ప్రొస్టేట్ క్యాన్సర్, మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

శరీర బరువు తగ్గడం.. పండ్లు బరువు తగ్గించేందుకు బొప్పాయి పండు హెల్ప్ చేస్తుంది. ఇందులోని ఫైబర్ ఎక్కువగా ఉండడం చాలా మంచిది. దీని వల్ల జీర్ణ సమస్యలు, మలబద్ధకం దూరమవుతుంది. ఇందులో విటమిన్ ఎ సహా పోషకాలు ఉంటాయి. దీంతో జీర్ణక్రియ పెరిగి చెడు కొలెస్ట్రాల్ కొవ్వుని తగ్గిస్తుంది. రోజూ ఉద యాన్నే బొప్పాయి తీసుకుంటే బరువు తగ్గడంలో హెల్ప్ చేస్తుంది. చర్మ కాంతి చర్మాన్ని అందంగా మార్చడంలోనూ ఈ పండ్లు చాలా కీ రోల్ పోషిస్తాయి. ఇందులో విటమిన్ ఎ, పొటాషియలు ఉన్నాయి. ఇవి చర్మ సమస్యల్ని దూరం చేసి చర్మాన్ని హైడ్రేట్ చేస్తాయి. ఇది చర్మంలో మృతకణా లను దూరం చేసి ముఖానికి రక్త ప్రసరణ పెంచి డార్క్ కాంప్లెక్షన్ ని తగ్గించి మంచి రంగు వస్తుంది.

ఇమ్యూనిటీ.. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఇమ్యూనిటీని పెంచుతాయి. దీంతో చాలా వరకూ సీజనల్ సమస్యలు, జ్వరం, జలుబు వంటి సమస్యల్ని దూరం చేస్తుంది.

# నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనది

- వారి సేవలు చిరస్మరణీయం
- వారిది ఉదయోగం కాదు.. నిరంతర సేవ
- 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందచేత
- వారి సేవలు నిరుపమానమని అన్న మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, మే 12 :** ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు పొందిన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేశారు. కోఠి ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మీర్జా రహ్మత్ బేగ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీపీహెచ్ రవింద్ర నాయక్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నర్సులను ఉద్దేశించి ప్రసంగించారు.
అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని నర్సులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నర్సింగ్ ఆఫీసర్లకు, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం రోజునే నియామక పత్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈరోజు మీకు జీవితాంతం గుర్తిండిపోతుంది. నర్సింగ్ అనేది కేవలం ఒక వృత్తి కాదు.. మానవత్వానికి చేసే గొప్ప అవకాశం. రోగులకు చికిత్స అందించడమే కాదు.. వారికి ధైర్యం, భరోసా, ఆశను కల్పించేది నర్సులే. ప్రపంచ నర్సింగ్ రంగానికి మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలి. పరిశుభ్రత, క్రమశిక్షణ, శాస్త్రీయ వైద్య సేవల ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయురాలు ఆమె. మీరు అందరూ ఆమెను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలి. కోవిడ్‌లో కుటుంబ సభ్యులు కూడా పేషెంట్ల దగ్గర ఉండలేని పరిస్థితి, అటువంటి భయంకర మైన పరిస్థితుల్లో కూడా నర్సులు సేవలు అందించారు. తెలంగాణ ప్రజలు ఆ సేవలను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. గతంలో ప్రభుత్వ హాస్పిటళ్లలో భారీగా ఖాళీలు ఉండటం వల్ల వైద్య సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి ఉండేది. ఈ సమస్యను మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని భారీ స్థాయిలో నియామకాలు చేపట్టింది. గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో దాదాపు 13 వేల పోస్టులను భర్తీ చేశాం. ఇదే గ్రౌండ్‌లో ఇప్పటికే 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు నియామక పత్రాలు అందజేశాం. ఇక్కడే 623 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్‌లకు నియామక పత్రాలు అందించాం. ఇక్కడే 132 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు నియామక పత్రాలు అందించాం. ఈరోజు ఇక్కడే 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందిస్తున్నాం అని మంత్రి వివరించారు. గతంలో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేశాం. రెండున్నర సంవత్సరాల్లో 9 వేల నర్సింగ్ పోస్టులను భర్తీ చేసిన ఘనత మన ప్రభుత్వానికి దక్కుతుంది. దాదాపు మరో 5 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో సుమారు 2 వేల ఏఎన్ఎం పోస్టుల ఫలితాలు మరో ఒకటి, రెండు రోజుల్లో ప్రకటిస్తాం. న్యాయపరమైన కారణాలతో ఆలస్యమైన 732 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీని కూడా త్వరలో పూర్తి చేస్తాం అని మంత్రి దామోదర వెల్లడించారు.



## బీఆర్ఎస్ ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ

### పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రధానంగా దృష్టి

**గజ్వేల్, మే 12 :** బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ దాదాపు ఆరు గంటలుగా కొనసాగింది. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ వివిధ అంశాలపై పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు ప్రక్రియ, పార్టీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం సహా పార్టీ బలోపేతం వంటి ముఖ్యమైన విషయాలపై కేసీఆర్ అధ్యక్షతన చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభా పక్షాల ఉపనాయకులు పాల్గొన్నారు. అలాగే అసెంబ్లీ డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్లు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసన మండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఉన్న గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల రద్దుపైనా సుదీర్ఘ చర్చ కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ కమిటీల స్థానంలో కొత్త కమిటీలను ఎన్నుకోవాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. కమిటీల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసే యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా నేతలతో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణ పర్యటనపైనా కేసీఆర్ ఆరా తీస్తున్నట్లు సమాచారం. బండి సంజయ్ కుమారుడి కేసు వ్యవహారం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశం గురించి కేసీఆర్‌కు బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ వివరించినట్లు సమాచారం. కొత్తగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపైనా బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ చర్చించారు. అలాగే ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై బలంగా పోరాటాలు చేయాలని నేతలను కేసీఆర్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పార్టీ బలోపేతం, కొత్త కమిటీల నియామకంపై దృష్టి సారించారు.

## తరుగు, తేమ పేరుతో దోపిడీ

### రైతు ఆందోళనకు ఎమ్మెల్యే మద్దతు

**మెదక్, మే 12:** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమ, తరుగు పేరుతో రెండు కిలోలకు పైగా అదనంగా తీసుకుంటున్నారని, దీన్ని వెంటనే నిలిపియాలని నర్సాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయాలని జాతీయ రహదారిపై రైతులు, బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. రైతులకు మద్దతుగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వం లారీల సమస్య, హమాలీల సమస్యను వెంటనే పరిష్కరించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే శివంపేట మండలం చిన్న గొట్టిముక్కల చౌరస్తా వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా చేశారు. రైతుల ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై రైతులు ధర్నా చేయడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రైతులను బుజ్జగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం

### గోడౌన్‌లో మంటలు చెలరేగి వాహనాలు దగ్ధం

**సంగారెడ్డి, మే 12 :** సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పటాన్‌చెరులోని శ్రీరామ్ ఆటో ఫైనాన్స్‌కు చెందిన వాహనాల గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో మూడు టిప్పర్లు, డీసీఎం, రెండు ఆటోలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోడౌన్‌లో నిల్వ ఉంచిన వాహనాల మధ్య నుంచి మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే మంటలు తీవ్రరూపం దాల్చడంతో గోడౌన్ మొత్తం దగ్ధమైంది. అక్కడ పార్క్ చేసిన పలు కార్లు పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఉదయనిధి మరోమారు అనుచిత వ్యాఖ్యలు

### సనాతన ధర్మంపై నోరు పారేసుకున్న డీఎంకె నేత

### ఉదయనిధి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేత

**చెన్నై,మే12 :** తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ మరోసారి సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మూడేళ్ల క్రితం ఉదయనిధి సనాతన ధర్మంపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియాతో పోల్చుతూ దానిని నిర్మూలించాలని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పలువురు కోర్టులలో పిటిషన్లు కూడా వేశారు. తాజాగా, మంగళవారం మధ్యాహ్నం తమిళనాడు అసెంబ్లీలో కూడా ఉదయనిధి అదే తరహా వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని అసెంబ్లీ వేదికగా ప్రసంగించారు. అసెంబ్లీ కొత్త స్పీకర్‌గా ఎన్నికైన జె.సి.డి. ప్రభాకర్‌ను అభినందిస్తూ చేసిన ప్రసంగంలో ఉదయనిధి స్టాలిన్ ఈ వ్యాఖ్య చేశారు. ఉదయనిధి వ్యాఖ్యలపై తమిళనాడు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసన్ ఘాటుగా స్పందించారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ఆయన మారలేదని విమర్శించారు. డీఎంకే నిజంగా ఇదే సిద్ధాంతాన్ని నమ్మితే ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు హిందూ మతాన్ని నిర్మూలించడమే ఉదయనిధి స్టాలిన్, డీఎంకేల విధానమైతే, దానిని వారి ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు ప్రస్తావించలేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచార సమయంలో ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మం నిర్మూలన గురించి ఎందుకు మాట్లాడలేదు. ఎన్నికల ప్రచారం చివరి రోజున 'మేం హిందువులకు వ్యతిరేకం కాదు' అని స్టాలిన్ ఎందుకు చెప్పుకున్నారు' అని శ్రీనివాసన్ ప్రశ్నించారు.

## చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ

- ప్రత్యేక దృష్టి సారించిన తెలంగాణ ప్రభుత్వం
- అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష



**హైదరాబాద్, మే 12 :** తెలంగాణ రాష్ట్రంలో చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల సమీక్షా సమావేశం మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వెట్‌ల్యాండ్స్ అథారిటీ కార్యకలాపాలు, వెట్‌ల్యాండ్స్ కాలుష్య నియంత్రణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్ర వివరాలు సమర్పించారు. ఈ సమావేశానికి అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల పునరుద్ధరణ, అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. వెట్‌ల్యాండ్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. చెరువుల ఆక్రమణలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశర చేశారు. అక్రమ నిర్మాణాలు, కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పక్షులు, జలచరాలు, పర్యావరణ సమతుల్యతకు వెట్‌ల్యాండ్స్ కీలకమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో వెట్‌ల్యాండ్స్ పాత్ర అత్యంత ముఖ్యమని, వాటి సంరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వెట్‌ల్యాండ్స్ మ్యాపింగ్, మానిటరింగ్ పక్రియపై కూడా సమావేశంలో చర్చించారు. చెరువుల స్థితిగతులు, ఆక్రమణలు, కాలుష్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షించాలని అధికారులు అభిప్రాయపడ్డారు. చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల సంరక్షణలో కూడా వెట్‌ల్యాండ్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెట్‌ల్యాండ్స్ సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, జీవ వైవిధ్య పరిరక్షణలో కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

## వ్యక్తిగత హక్కులకు భంగం

- అనుమతి లేకుండా పేరు, ఫోటోల వాడకం
- ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన నటుడు నాగార్జున



**న్యూఢిల్లీ, మే 12 :** తన వ్యక్తిగత హక్కులకు భంగం కలిగిస్తున్నారంటూ ఢిల్లీ హైకోర్టును సినీ నటుడు అక్కినేని నాగార్జున ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా పేరు, ఫొటోలను వాడుకుంటున్నారని హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఓ బట్టల వ్యాపారి దుస్తులపై తన చిత్రాలు, పేరు వాడుతున్నాడని కోర్టు దృష్టికి నాగార్జున తీసుకెళ్లారు. ఈ కేసుపై నేడు విచారణ చేపట్టిన న్యాయస్థానం సదరు వ్యాపారిపై సీరియస్ అయ్యింది. నాగార్జున టీ షర్టులు మీరెలా అమ్ముతారంటూ వ్యాపారిని హైకోర్టు ప్రశ్నించింది. ఫొటోలను వాణిజ్యపరంగా వాడుకునే అధికారం మీకు ఎవరిచ్చారంటూ కోర్టు నిలదీసింది. తొలుత వ్యాపారి తరఫు న్యాయవాది శృతి అయ్యర్ వాదనలు వినిపిస్తూ 'ది ఘోస్ట్' సినిమాకు తాము అధికారిక మర్చండైజింగ్ భాగస్వాములమని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి తమకు కేసు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు. ఓ మార్కెటింగ్ ఏజెన్సీ ద్వారా ప్రొడక్షన్ హౌస్‌తో తమకు ఒప్పందం ఉందని.. నాగార్జున స్వయంగా ఆ వస్తువులను ప్రమోట్ చేశారని స్పష్టం చేశారు. దీనిపై నాగార్జున తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒప్పంద పత్రాలు అడిగినప్పటికీ సమర్పించ లేదని, కోర్టుకు ఇచ్చిన ఈ-మెయిల్ కాపీలు సైతం అసంపూర్ణంగా ఉన్నాయని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చివరికి, ఈ వ్యవహారంలో తమకు నాగార్జునతో కానీ, సంబంధిత నిర్మాణ సంస్థతో కానీ ఎటువంటి ప్రత్యక్ష ఒప్పందం లేదని న్యాయస్థానం ముందు వ్యాపారి అంగీకరించారు. ఈ వాదనలపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. నాగార్జున, ప్రొడక్షన్ హౌస్‌తో ప్రత్యక్ష ఒప్పందం లేదని మీరే అంగీకరిస్తున్నప్పుడు.. టీ షర్టులను విక్రయించే చట్టబద్ధత ఎక్కడి నుంచి వచ్చిందని సీరియస్ అయ్యింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది

## చిన్నారి హత్య కేసులో నిందితుడికి మరణ శిక్ష

### కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు

**హైదరాబాద్, మే 12 :** ఓ బాలుడి హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పునిచ్చింది. చిన్నారిని హత్య చేసిన వ్యక్తికి మరణశిక్ష విధించింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లో 2023 సంవత్సరంలో జరిగిన మైనర్ హత్యోదంతం సంచలనం సృష్టించింది. ఇమ్రాన్ అలీ ఖాన్ (33) అనే వ్యక్తి చిన్నారిని హత్య చేయగా.. అతనికి మహమ్మద్ రఫీక్ (32) సహకరించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై సనత్‌నగర్ పోలీసులు అప్పుడే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఇమ్రాన్ అలీ ఖాన్, మహమ్మద్ రఫీక్‌ను గుర్తించి అరెస్టు చేశారు. కేవలం సాంకేతిక సాక్ష్యాలతో కేసును ఛేదించి.. వివరాలను కోర్టుకు సమర్పించారు. పకడ్బందీగా సాక్ష్యాలు ఉండటంతో సంతృప్తి చెందిన కూకట్‌పల్లి కోర్టు.. చిన్నారిని వారే హత్య చేసినట్లు నిర్ధారిస్తూ దోషులుగా తేల్చింది. ఇమ్రాన్ అలీ ఖాన్‌కు మరణశిక్ష, అతనికి సహకరించిన మహమ్మద్ రఫీక్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వెంకటేశ్వర రావు తీర్పు వెలువరించారు.



## అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

### ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు

### ఎన్‌డి ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక

**గౌహతి, మే 12 :** అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు. హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీలైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాములైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిష్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. హిమంత ప్రమాణస్వీకార కార్యక్రమానికి పీఎం మోదీ సహా పలువురు కీలక నేతలు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

## నీట్ పేపర్ లీకేజీకి కేంద్రానిదే బాధ్యత

- పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి
- ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్

**హైదరాబాద్, మే 12 :** దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ఎంపీ చామల కిరణ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షను రద్దు చేశారని అన్నారు. నీట్ పరీక్ష రద్దుకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ, సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్‌ను కోల్పోయే అవకాశం ఉందన్నారు. నీట్ పరీక్ష రద్దుపై బీజేపీ ప్రభుత్వం చర్చ చేపట్టాలన్నారు. దేశంలో అనేక విషయాలపై చర్చ చేసే బీజేపీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై సమాధానం చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు. బీజేపీకి పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బీజేపీకి వద్దా అని నిలదీశారు. నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్‌లు ఇప్పించి నీట్ పరీక్ష రాయించారని తెలిపారు. రాజస్థాన్‌లో నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్రం పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల అకడమిక్ ఇయర్ దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## భగీరథ్ కేసులో నా వ్యాఖ్యలు వక్రీకరించారు

- బాధితురాలికి కూడా న్యాయం జరగాలని కోరా
- మరోమారు వివరణ ఇచ్చిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, మే 12 :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం చేయాలని మాత్రమే తాను మాట్లాడానని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం చేసే అంశంపైనే తాను మాట్లాడానని.. తన మాటలను కొంతమంది వక్రీకరించారని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం మాట్లాడారు. ఈ కేసులో భగీరథ్ విచారణ ఎదుర్కొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని తాను అన్నానని ప్రస్తావించారు. ఈ విషయంలో కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మున్నూరు కాపు సంఘాలు ఆరోపణలు చేశాయని అన్నారు. ఈ కేసులో బాధితురాలు కూడా అదే సామాజిక వర్గమని తాను చెప్పానని ప్రస్తావించారు. తన ఉద్దేశంలో కూడా బాధితురాలికి న్యాయం జరగాలనే తపన మాత్రమే ఉందని అన్నారు. ఇందులో ఎక్కడ కూడా కాంప్రమైజ్ కావాలని తాను మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. బాధితురాలికి కాంగ్రెస్ అండగా ఉంటుందని.. వారికి పూర్తిగా మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తాను పోరాడతానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## భగీరథ్‌కు సిట్ నోటీసులు

### నేడు విచారణకు రావాలని ఆదేశం



**హైదరాబాద్, మే 12 :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు ఆదేశించారు. సిట్ అధికారులు బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌ను విచారించనున్నారు. ఈ కేసుకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బాధితురాలి స్టేట్‌మెంట్ నమోదు చేసిన అనంతరం పోలీసులు ఈ కేసులోని సెక్షన్లను మార్చారు. గతంలో నమోదు చేసిన పోక్సో యాక్ట్ సెక్షన్లను సవరించారు.

# ఐటీ స్టాక్స్‌కు ఓపెన్ ఏఐ షాక్..

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. బెంచ్ మార్క్ సూచీలు 1 శాతానికి నష్టాల్లో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల వల్ల సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా ఓ దశలో 3.7 శాతం మేర నష్టపోయింది. 2023 మే తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. అమెరికాకు చెందిన ఏఐ సంస్థ ఓపెన్‌ఏఐ కొత్త కంపెనీని ప్రకటించడం ఇందుకు నేపథ్యం. శామ్‌ఆల్ట్‌మన్ నేతృత్వంలోని ఓపెన్ ఏఐ సంస్థ కొత్తగా 'ఓపెన్ ఏఐ డిప్లాయ్‌మెంట్ కంపెనీ'ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం 4 బిలియన్ డాలర్లు వెచ్చించనున్నట్లు తెలిపింది. సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను ఏఐ సిస్టమ్స్‌తో నిర్వహించుకోవడం దీని ఉద్దేశం. దీంతో సంప్రదాయ ఐటీ సర్వీస్ కంపెనీల వ్యాపారానికి ముప్పుగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది నేటి ట్రేడింగ్ సెషన్‌లో ప్రతిఫలించిందని నిపుణులు చెబుతున్నారు. మంగళవారం ట్రేడింగ్ సెషన్‌లో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 3.7 శాతానికి పైగా నష్టంతో దాదాపు 1000 పాయింట్లకు పైగా కోల్పోయి 28,300 స్థాయికి పడిపోయింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్‌లోని అన్ని స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. పెర్సిస్టెంట్ సిస్టమ్స్ ఐదు శాతం మేర




పతనం కాగా.. టీసీఎస్, ఎల్‌టీఎం, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, కోఫోర్జ్ సైతం 2-4 శాతం మేర నష్టోయాయి. అయితే, కేవలం ఏఐ మాత్రమే కాకుండా అమెరికాలో వడ్డీ రేట్లు పెరుగుతాయన్న ఆందోళనలు, దీనివల్ల భవిష్యత్‌లో ఐటీ కంపెనీల ఆదాయాలు తగ్గుతాయన్న భయాలూ దీనికి తోడయ్యాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇటీవల వెలువడిన త్రైమాసిక ఫలితాల సందర్భంగా భవిష్యత్ అంచనాలేమీ అంత ఆకర్షణీయంగా లేకపోవడం కూడా మరో కారణమని చెబుతున్నారు.






# 10 లక్షల కోట్లు ఆవిరి

## భారీ నష్టాల్లో సూచీలు..

**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాల నడుమ వరుసగా నాలుగో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపాయి. దీనికితోడు ప్రధాని మోదీ పొదుపు చర్యలు ప్రకటించడం, ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం 'లైఫ్ సపోర్ట్' మీద ఉందంటూ ట్రంప్ వ్యాఖ్యానించడం వంటివి మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 1500 పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 23,400 దిగువకు చేరింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒక్కరోజులోనే రూ.10 లక్షల కోట్లు క్షీణించి రూ.457 లక్షల కోట్లకు చేరింది. రోజంతా నష్టాల్లోనే: సెన్సెక్స్ ఉదయం 75,688.39 (క్రితం ముగింపు 76,015.28) పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 74,449.50 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1456 పాయింట్ల నష్టంతో 74,559.24 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 436 పాయింట్ల నష్టంతో 23,379.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.63 వద్ద జీవనకాల కనిష్ఠానికి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్క ఎస్‌బీఐ మినహా మిగిలిన కంపెనీల షేర్లన్నీ నష్టాల్లో ముగిశాయి. టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, టైటాన్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4700 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

### కారణాలు ఇవే..

- పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని, ఏడాది పాటు బంగారం కొనొద్దంటూ ప్రధాని చేసిన సూచనలు వినియోగ ఆధారిత రంగాలపై ప్రతికూల ప్రభావం చూపాయి. దీర్ఘకాలంలో వృద్ధి మందగించొచ్చన్న భయాలు సూచీలను ప్రభావితం చేశాయి.
- శాశ్వత శాంతి కోసం టెహ్రాన్ పంపిన తాజా ప్రతిపాదనను డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించడంతో పాటు అది తమకు ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు మరోసారి విఫలమవ్వడం, యుద్ధ భయాలు నెలకొనడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లలో ఆందోళన పెరిగింది.
- బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్ 100 డాలర్ల ఎగువన స్థిరంగా కొనసాగుతుండడం భారత ఆర్థిక వ్యవస్థపై భారాన్ని పెంచుతోంది. ఇది ద్రవ్యోల్బణానికి దారితీస్తుందనే భయం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.
- డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు స్థాయిలో 95.63 వద్దకు పడిపోయింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూపాయి సుమారు 6 శాతం మేర క్షీణించింది. దీనికితోడు విదేశీ మదుపర్ల అమ్మకాల కొనసాగుతుండడమూ ప్రతికూల ప్రభావం చూపింది.



# గుజరాత్ చేతిలో సన్‌రైజర్స్ ఘోర పరాజయం

**అహ్మదాబాద్:** సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్ అదరగొట్టింది. మంగళవారం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును 82 పరుగుల తేడాతో చిత్తు చిత్తుగా ఓడించింది. గుజరాత్ పేసర్ల ధాటికి సన్‌రైజర్స్ కుదేలైంది. 169 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన ఎస్ఆర్‌హెచ్ 14.5 ఓవర్లలో 86 పరుగులకే కుప్పకూలింది. హైదరాబాద్ టీమ్‌లో ఏ బ్యాటర్ కూడా 20 పరుగులు చేయలేకపోయాడంటే గుజరాత్ బౌలర్లు ఏ స్థాయిలో విజృంభించారో అర్థం చేసుకోవచ్చు. ఎనిమిదో స్థానంలో వచ్చిన కమిన్స్ (19) టాప్ స్కోరర్. సలీల్ అరోరా (16), క్లాసెన్ (14), ఇషాన్ కిషన్ (11) పరుగులు చేశారు. నాలుగు బంతులు ఎదుర్కొన్న ట్రావిస్ హెడ్ డకౌట్ అయ్యాడు. అభిషేక్ శర్మ (6), స్మరన్ రవిచంద్రన్ (9), నితీశ్ రెడ్డి (2) పరుగులకే వెనుదిరిగారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కగిసో రబాడ (3/28), జేసన్ హోల్డర్ (3/20) హైదరాబాద్‌ను దెబ్బకొట్టారు. ప్రసిద్ధ్ కృష్ణ 2, సిరాజ్, రషీద్ ఖాన్ ఒక్కో వికెట్ తీశారు. ఈ గెలుపుతో గుజరాత్ టీమ్ (16 పాయింట్లు) అగ్రస్థానానికి దూసుకెళ్లింది. జీటీ దాదాపుగా ప్లేఆఫ్స్‌నకు చేరినట్టే. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (61; 44 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), వాషింగ్టన్ సుందర్ (50; 33 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు సాధించారు. నిశాంత్ సింధు (22) పరుగులు చేశాడు. శుభ్‌మన్



గిల్ (5), బట్లర్ (7) సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. సన్‌రైజర్స్ బౌలర్లలో సాకిబ్ హుస్సేన్ 2, ప్రఫుల్ హింగే 2, కమిన్స్ ఒక వికెట్ పడగొట్టారు. ఐపీఎల్‌లో పరుగుల పరంగా సన్‌రైజర్స్‌కు ఇది అతిపెద్ద



ఓటమి కావడం గమనార్హం. అంతేకాదు ఐపీఎల్ చరిత్రలో హైదరాబాద్‌కు ఇదే అత్యల్ప స్కోరు.




# చమురు సంస్థలకు రూ.లక్ష కోట్ల నష్టాలు రావొచ్చు

## కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ

పశ్చిమాసియా సంక్షోభాన్ని తట్టుకోవడానికి ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు ఓ మేల్కొలుపు అని చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ వెల్లడించారు. అదే సమయంలో దేశంలో ఇంధన సరఫరా సమస్యలు ఏవీ లేవని, ప్రభుత్వం ఉత్పత్తిని రోజుకు 35,000-36,000 టన్నుల నుంచి 54,000 టన్నులకు పెంచినట్లు తెలిపారు. అయితే, భగ్గుమంటున్న ముడిచమురు ధరల వల్ల ఆయిల్ కంపెనీలకు రూ.లక్ష కోట్ల వరకు నష్టాలు రావొచ్చని హెచ్చరించారు. సీఐఐ వార్షిక వ్యాపార సదస్సులో మాట్లాడుతూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "పశ్చిమాసియా ఘర్షణల వేళ ఆర్థిక భారాన్ని తగ్గించే చర్యల గురించి ఆలోచించడానికి ప్రధాని మోదీ (రావీ వీశీఎఱ) ఇచ్చిన పిలుపు ఒక మేల్కొలుపు. యుద్ధం నేపథ్యంలో ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని మనం ఎంతో బాధ్యతాయుతంగా ఎదుర్కొన్నాం. ఎక్కడా కొరత లేదు" అని మంత్రి వెల్లడించారు. దేశంలో 69 రోజులకు సరిపడా ముడిచమురు, ఎల్ఎన్‌జీ స్టాక్ ఉందని, 45 రోజులకు సరిపడా ఎల్‌పీజీ ఉందని పేర్కొన్నారు. అయితే ముడి చమురు ధరలు అధికంగా ఉండి, రిటైల్ ధరలు ఇలాగే కొనసాగితే ఒకే త్రైమాసికంలో ప్రభుత్వరంగ చమురు సంస్థలు రూ.లక్ష కోట్ల వరకు నష్టాలను చవిచూడాల్సి వస్తుందని ఆయన అన్నారు. "చమురు కంపెనీలు రోజుకు రూ.1000కోట్లు నష్టపోతున్నాయి. మొత్తంగా రెవెన్యూ లోటు రూ.1.98లక్షల కోట్లకు పెరిగింది. ఒక్క త్రైమాసికంలోనే రూ.లక్ష కోట్ల మేర నష్టాలు వస్తే, ఈ రంగం ఆర్జించే వార్షిక లాభాలు తుడిచిపెట్టుకుపోతాయి" అని పేర్కొన్నారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలను దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ పొదుపు చర్యల గురించి దేశ ప్రజలకు పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. "పశ్చిమాసియాలో సాధారణ పరిస్థితులు నెలకొనేంతవరకు దేశ ప్రజలంతా పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలి. ప్రజా రవాణా సౌకర్యాలను ఎక్కువగా వినియోగించుకోవాలి. 'వర్క్ ఫ్రమ్ హోం'ను సంస్థలు ప్రోత్సహించాలి. విద్యాసంస్థలు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలి. బంగారం కొనుగోలు చేస్తే దేశానికి చెందిన డబ్బులు విదేశాలకు వెళ్లిపోతాయి. కాబట్టి సాధారణ పరిస్థితులు నెలకొనేవరకు పసిడి కొనకండి. విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లకండి. భారత్‌లోనే పెళ్లిళ్లు జరుపుకోండి" అని మోదీ కోరారు.

# కోహ్లీపై తప్పుడు ఆరోపణలు చేస్తే డబ్బులిస్తామన్నారు : జర్మనీ మోడల్ లిజ్లాజ్

కొన్ని రోజుల కిందట విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి కొట్టిన లైక్‌తో జర్మనీ మోడల్ లిజ్లాజ్ పాపులరైన సంగతి తెలిసిందే. దీంతో కోహ్లీని నెటిజన్లు ట్రోల్ చేశారు. ఆ లైక్ వెనక అతనికి దురుద్దేశం లేకపోయినా నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకున్నారని లిజ్లాజ్ అప్పట్లోనే క్లారిటీ ఇచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఈ అంశానికి సంబంధించి సంచలన విషయాన్ని బయటపెట్టింది. కోహ్లీపై తప్పుడు ఆరోపణలు చేసేలా తనను ఒప్పించడానికి కొంతమంది జర్నలిస్టులు సంప్రదించారని, అలా చేయడానికి తనకు డబ్బు కూడా ఆఫర్ చేశారని పేర్కొంది. "కొందరు విలేకరులు విరాట్ కోహ్లీ గురించి చెడుగా మాట్లాడాలని నన్ను ఒప్పించడానికి ప్రయత్నించారు. అతనిపై లేని పోని ఆరోపణలు చేయమని డబ్బు ఆఫర్ చేశారు. కానీ నేనెందుకు అలా చేస్తాను? డబ్బు లేదా ప్రచారం కోసం కోహ్లీ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఆసక్తి గానీ, ఉద్దేశం గానీ నాకు లేదు" అని లిజ్లాజ్ తెలిపింది. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ 'లైక్' నేపథ్యంలో కోహ్లీపై ట్రోలింగ్ జరగడంతో ఈ జర్మనీ మోడల్ కొన్ని రోజుల కిందట స్పందించింది. విరాట్‌పై విమర్శలు రావడం బాధగా అనిపించిందని పేర్కొంది. "ముందు విరాట్ కోహ్లీ నా ఫొటోని లైక్ చేసినప్పుడు ఎంతో సంతోషించాను. ఆ తర్వాత ఆ పోస్ట్‌ని ఆయన అన్‌లైక్ చేశారు. అనుకోకుండా నేను పాపులర్ అయినందుకు ఆనందమే కానీ, తర్వాత బాధగా అనిపించింది. ఈ ఒక్క లైక్ సోషల్ మీడియాలో ఇంత పెద్ద స్టోరీ అవుతుందని ఊహించలేదు. కోహ్లీని ఇంతగా ట్రోల్ చేస్తారనుకోలేదు. ఆ లైక్ వెనక అతనికి దురుద్దేశం లేకపోయినా నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకున్నారు. ఏదేమైనా నా ఫొటోని స్టార్ క్రికెటర్ లైక్ చేసినందుకు గర్వంగా అనిపించింది" అని లిజ్లాజ్ వివరించింది. ఈ జర్మనీ మోడల్‌కు ఐపీఎల్ మ్యాచ్‌లంటే తెగ ఇష్టమట. ఆర్సీబీకి వీరాభిమాని అని చెప్పింది.



# ఆకాశాన్ని అంటింది



'కేజీఎఫ్', 'కాంతార' చిత్రాలతో కన్నడ సినిమాలకి మంచి క్రేజ్ పెరిగింది. కన్నడ మేకర్స్ సినిమాను చుట్టేస్తారు అనే మాట ఈ రెండు చిత్రాలతో చెరిగిపోయింది. ఇప్పుడు అక్కడ కూడా భారీ బడ్జెట్, పాన్ ఇండియా చిత్రాలు తెరకెక్కుతున్నాయి. హీరోల పారితోషికాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. యశ్, రిషబ్ శెట్టి లాంటి స్టార్లు పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పొందటంతో వాళ్ల పారితోషికాలు ఊహకు అందనంత పెరుగుతున్నాయి. 'కేజీఎఫ్' తరవాత యశ్ గ్రాఫ్ పూర్తిగా మారిపోయింది. 'కేజీఎఫ్ 2' కోసం దాదాపు రూ.50 కోట్లు రెమ్యూనరేషన్ తీసుకున్నారని టాక్. 'టాక్సిక్' కోసం అటూ ఇటుగా రూ.75 కోట్లు అని శాండల్ వుడ్లో వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు రిషబ్ శెట్టి కూడా ఈ మార్క్ కు చేరుకొన్నాడు.

తెలుగులో తెరకెక్కుతున్న 'జై హనుమాన్' సినిమా కోసం రిషబ్ రూ.80 కోట్లు డిమాండ్ చేశాడని తెలుస్తోంది. యశ్‌తో సితార సంస్థ ఓ చిత్రాన్ని కమిట్ అయింది. అశ్విన్ గంగరాజు దీనికి దర్శకుడు. ఈ సినిమాకూ అటూ ఇటుగా రూ.80 కోట్లు డిమాండ్ చేసాడని తెలుస్తోంది. 'కాంతార' తో రిషబ్ కి పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు దక్కింది. 'కాంతార 2' దాదాపు రూ.300 కోట్లు సాధించింది. అందుకే ఇప్పుడు రిషబ్ శెట్టి పారితోషికం కూడా రెట్టింపు అయ్యిందని టాక్. 'కాంతార'తో రిషబ్ శెట్టి కి తెలుగులో మార్కెట్, అభిమానుల సంఖ్య పెరిగింది. అతని చిత్రాలకు మంచి ఓపెనింగ్స్ వస్తున్నాయి. దాంతో నిర్మాతలు కూడా రిషబ్ అడిగినంత ఇవ్వడానికి రెడీ అవుతున్నారని ఫిలిం నగర్లో వినిపిస్తోంది. తాజాగా తెరకెక్కుతున్న 'జై హనుమాన్' బడ్జెట్ రూ.200 కోట్లకు పైగా బడ్జెట్ తో రూపొందుతోంది.

సితార ఎంటర్టైన్మెంట్స్ లో తెరకెక్కుతున్న సినిమా కూడా పెద్ద బడ్జెట్ సినిమానే. ఈ రెండింటిలో 'జై హనుమాన్' ముందుగా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ రెండు సినిమాల్లో ఏది హిట్ అయినా రిషబ్ రూ.100 కోట్ల హీరోల జాబితాలో చేరిపోతాడు. అదే జరిగితే .100 కోట్ల పారితోషికం అందుకొన్న తొలి కన్నడ హీరోగా రిషబ్ పేరు నిలిచిపోతుంది.

# అన్నతో సినిమా



'కమిటీ కుర్రాళ్లు' సినిమా సక్సెస్‌తో మంచి జోరు మీదున్నారు కొణిదెల నిహారిక. ఆ సినిమా పలు విభాగాలలో గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులను అందుకుంది. ఆ ఉత్సాహంతో మరిన్ని ప్రాజెక్స్ చేయడానికి ఆమె సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా సంగీత్ శోభన్ తో 'రాకాస' మూవీని నిహారిక నిర్మించింది. అది ఏప్రిల్ 3న విడుదల కాబోతోంది. ఇదిలా ఉంటే... ఇటీవల యదు వంశీ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే! ఇప్పుడామె నుంచి మరో క్రేజీ వార్త బయటకు వచ్చింది. తన సోదరుడు వరుణ్ తేజ్‌తో ఓ సినిమా నిర్మించడానికి రెడీ అయిందని తెలిసింది. ప్రస్తుతం వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' చిత్రంలో నటిస్తున్నారు. మేర్లపాక గాంధీ ఈ చిత్రానికి దర్శకుడు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ ఏడాది వేసవిలో ఈ చిత్రం విడుదల కానుంది. అయితే ఈ సినిమా తర్వాత వరుణ్ రెండు చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. అందులో ఒకటి నిహారిక నిర్మించనున్నారని తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుందని సమాచారం. వరుణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రెండు చిత్రాల్లో ఒకదానికి అట్లీ దగ్గర అసోసియేట్‌గా పనిచేసిన బాలాజీ దర్శకత్వం వహించనుండగా, స్టోన్ బెంచ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మించనుంది.


# మరో సారి

స్టార్ హీరో ధనుష్ కథానాయకుడిగా, దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి రూపొందిస్తున్న భారీ చిత్రంలో ప్రముఖ నటి సాయి పల్లవి హీరోయిన్‌గా ఎంపికైంది. సోమవారం చిత్ర నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్స్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. గతంలో బాలాజీ మోహన్ దర్శకత్వంలో వచ్చిన 'మారి 2'లో ధనుష్, సాయి పల్లవి జోడీకి మంచి మార్కులు పడ్డాయి. ఇప్పుడు మళ్లీ ఈ హిట్ కాంబో రిపీట్ కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

ధనుష్ నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిలింస్, ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న సంస్థల్లో ఒకటి. తమ ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా సాయి పల్లవికి స్వాగతం పలుకుతూ, "ఆమె అందం, శక్తి రెండింటి కలబోత. అందరి ఫేవరెట్ సాయి పల్లవికి చణ55 టీంలోకి స్వాగతం. హిట్ కాంబో మళ్లీ వెండితెరపైకి వస్తోంది" అని పోస్ట్ చేసింది. గతంలో ధనుష్, సాయి పల్లవి కలిసి బాలాజీ మోహన్ దర్శకత్వంలో వచ్చిన 'మారి 2' చిత్రంలో నటించారు. ఈ సినిమాలో వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ, ముఖ్యంగా 'రౌడీ బేబీ' పాట ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీంతో ఈ హిట్ జోడీ మళ్లీ తెరపై సందడి చేయనుండటంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఇదిలా ఉండగా, ఈ చిత్రంలో ఇప్పటికే మరో కథానాయికగా యువతరం క్రేజీ హీరోయిన్ శ్రీలీలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. జనవరి 30న ఆమెను టీంలోకి ఆహ్వానిస్తూ మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. దీంతో ఇద్దరు ప్రముఖ హీరోయిన్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. వీరితో పాటు యువ సంగీత సంచలనం సాయి అభ్యంకర్‌ను ఈ చిత్రానికి సంగీత దర్శకుడి వ్యవహరిస్తున్నాడు. దీనిపై సాయి అభ్యంకర్ స్పందిస్తూ, ధనుష్‌తో పనిచేయడం ఒక కల అని, ఇది చాలా ప్రత్యేకమైన ప్రాజెక్ట్ అవుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ చిత్రాన్ని ఒక భారీ దృశ్యకావ్యంగా (మాగ్నమ్ ఓపస్) నిర్మిస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. వండర్‌బార్ ఫిలింస్‌తో పాటు ఆర్ టేక్ స్టూడియోస్ కూడా ఈ సినిమా నిర్మాణంలో భాగస్వామిగా చేరినట్లు ఇటీవలే ప్రకటించారు.



# ప్రశంసలు





టాలీవుడ్ యంగ్ హీరో సంతోష్ శోభన్ హీరోగా నటించిన లేటెస్ట్ లవ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ' కపుల్ ఫ్రెండ్లీ ' ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను యువీ క్రియేషన్స్ బ్యానర్‌పై అజయ్ కుమార్ రాజు నిర్మించారు. ప్రేమ, యువత ఆలోచనలు, ఆధునిక సంబంధాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం వాలెంటైన్స్ డే స్పెషల్‌గా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. సంతోష్ శోభన్ సరసన మానస వారణాసి హీరోయిన్‌గా నటించగా, రాజీవ్ కనకాల, యోగిబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ఇటీవల విడుదలైన 'కపుల్ ఫ్రెండ్లీ' ట్రైలర్ సినిమా మీద ఆసక్తిని మరింత పెంచింది. చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో లివింగ్ రిలేషన్‌షిప్ కాన్సెప్ట్‌ను కేంద్రంగా చేసుకుని తెరకెక్కిన ఈ ట్రైలర్, నేటి యువత జీవితాలను ప్రతిబింబించేలా ఉంది. పెళ్లి ఒత్తిడి నుంచి తప్పించుకుని నగరానికి వచ్చిన అమ్మాయి, తండ్రితో విభేదాల కారణంగా ఇంటి నుంచి బయటకు వచ్చిన అబ్బాయి... ఇద్దరూ కలిసి ఒకే రూమ్ షేర్ చేసుకోవడం నుంచి కథ మొదలవుతుంది. మొదట ఫ్రెండ్స్‌గా మారిన వీరు, ఆ తర్వాత ప్రేమలో పడటం, రిలేషన్‌షిప్‌ను మెయింటెయిన్ చేయడం వంటి అంశాలను సరదాగా, సహజంగా చూపించారు.

# ఫిక్స్ చేసేశాడా





నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం 'ప్యారడైజ్' సినిమాతో బిజీగా ఉన్నారు. షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మార్చి 26న ఈ చిత్రం విడుదల కానుంది. తదుపరి నాని సుజీత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. పూర్తిగా యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. దీనికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ఖరారైనట్లు సమాచారం. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది రెండో భాగంలో మొదలుకానుంది. ప్రస్తుతం చిత్ర బృందం నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎంపికలో నిమగ్నమై ఉంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించి నో వార్త నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమాలో నాని సరసన పూజా హెగ్డే కథానాయికగా నటించనుందని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన త్వరలో రానుందని తెలిసింది. ప్రస్తుతం నాని ప్యారడైజ్ సినిమాతో బిజీగా ఉండటం వల్ల సుజీత్ స్క్రిప్ట్ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఇందులో మలయాళస్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనుండటం మరో ప్రత్యేక ఆకర్షణ.

# నిజమైన

అలనాటి తార కల్పనా అయ్యర్ మరోసారి సోషల్ మీడియాలో సంచలనం సృష్టించారు. 45 ఏళ్ల క్రితం బాలీవుడ్‌ను ఊపేసిన 'అర్మాన్' (1981) సినిమాలోని 'రంభ హో' పాటతో అప్పట్లో యువతను ఉర్రూతలూగించిన ఈ నటి.. తాజాగా ఒక పెళ్లి వేడుకలో అదే పాటకు స్టెప్పులేసి ఆశ్చర్యానికి గురి చేశారు. ఏకంగా 70 ఏళ్ల వయసులోనూ ఆమె చూపించిన ఎనర్జీ, ఫిట్‌నెస్, గ్రేస్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ఏజ్ జస్ట్ ఏ నంబర్ అనే మాటకు కల్పనా అయ్యర్ సరైన ఉదాహరణ అంటూ కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు. 1981లో విడుదలైన 'అర్మాన్' సినిమాలోని 'రంభ హో' పాట అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ పాటలో కల్పనా అయ్యర్ అందం, డాన్స్ మూమెంట్స్, ఎక్స్‌ప్రెషన్స్ ఆమెను ఓవర్‌నైట్ స్టార్‌గా మార్చాయి. ఆ కాలంలో ఐటమ్ సాంగ్స్‌కు ఇంత క్రేజ్ ఉండేది కాదు. అయినా సరే, కల్పనా అయ్యర్ ఆ పాటతో ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ఇప్పుడు దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత, అదే పాటకు ఆమె మళ్లీ నృత్యం చేయడం అభిమానులకు నాస్టాల్జియా ఫీలింగ్‌ను తీసుకొచ్చింది. వయసును లెక్కచేయకుండా, కాన్ఫిడెన్స్‌తో స్టెప్పులేయడం అక్కడున్న అతిథులను మంత్ర ముగ్ధులను చేసింది. కల్పనా అయ్యర్ డాన్స్ వీడియోపై నెటిజన్లు ప్రశంసల కురిపిస్తున్నారు. '70 ఏళ్ల వయసులోనూ ఇంత ఎనర్జీనా! నిజమైన స్టైల్, నిజమైన గ్రేస్ అంటే ఇదే.. మళ్లీ పాత రోజులు గుర్తొచ్చాయి' అంటూ కామెంట్లు పెడుతున్నారు. 'ఇప్పటి హీరోయిన్స్ కూడా ఇంత గ్రేస్ చూపించలేరు' అంటూ మరికొందరు ప్రశంసిస్తున్నారు. కల్పనా అయ్యర్ కేవలం ఒక ఐటమ్ సాంగ్‌తోనే కాదు, తన డిసిప్లిన్, ఫిట్‌నెస్, లైఫ్‌స్టైల్‌తో కూడా ఇప్పటి తరం మహిళలకు ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తున్నారు.



# తప్పుకున్న డెకాయిట్



ఒకప్పుడు ఒక సినిమా వాయిదా పడింది అంటే అది అపశకునం అని ఫీల్ అయ్యేవారు. కానీ, ఇప్పుడు అది ఒక ట్రెండ్‌గా మారి పోయింది. మేకర్స్ చెప్పిన టైమ్ కి సినిమా రిలీజ్ అయితే అదే విశేషంగా మారుతోంది.

మేకర్స్ చెప్పిన టైమ్‌కి సినిమా రిలీజ్ అయితే అదే విశేషంగా మారుతోంది. కొన్ని సినిమాలు అయితే వాయిదాల మీదనే నడుస్తున్నాయి అని చెప్పొచ్చు. అలాంటి సినిమాల లిస్ట్ లో డెకాయిట్ కూడా చేరింది. అడివి శేష్ హీరోగా షానెయిల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తోంది. ఇక ఈ మూవీలో శేష్ సరసన మృణాల్ ఠాకూర్ నటిస్తోంది. ఇప్పటికే డెకాయిట్ నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు హైప్ కూడా పెంచేశాయి.

అన్ని బావుండి ఉంటే డెకాయిట్ గతేడాది క్రిస్మస్ కే రావాల్సింది. కానీ, మొదట హీరోయిన్ గా నటించిన శ్రుతి తప్పుకోవడం, ఆ సీన్స్ ని మళ్ళీ మృణాల్‌తో చేయించడంతో లేట్ అయ్యింది. అంతా ఓకే అనుకోని షూటింగ్ మొదలుపెట్టిన కొన్నిరోజులకే శేష్ కి సెట్ లో ప్రమాదం జరగడం, రెస్ట్ తీసుకోవడంతో షూటింగ్ ఫినిష్ కాలేదు. దీంతో క్రిస్మస్ నుంచి సమ్మర్ కి వాయిదా వేశారు. మార్చి 19 న పక్కాగా వస్తామని శేష్ బల్లగుద్ది మరీ చెప్పాడు. అయితే ఇప్పుడు ఆ డేట్ నుంచి కూడా డెకాయిట్ తప్పుకున్నట్లు తెలుస్తోంది.

డెకాయిట్ మరోసారి వాయిదా పడినట్లు సమాచారం. దానికి కారణం మార్చి 19నే పాన్ ఇండియా సినిమా ధురంధర్ 2 రిలీజ్ కానుంది. గతేడాది రిలీజ్ అయిన ధురంధర్ పార్ట్ 1 భారీ విజయాన్ని అందుకుంది. సెకండ్ పార్ట్ పై కూడా అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. ఇదే కాకుండా అదే రోజున యష్ టాక్సిక్ కూడా రానుంది. మొదట టాక్సిక్ కూడా వాయిదా పడుతుందేమో అనుకున్నారు. కానీ, అనుకున్న సమయానికే యష్ వస్తున్నట్లు సమాచారం. ఇక ఈ రెండు పెద్ద సినిమాల మధ్య నలిగిపోవడం ఎందుకని, డెకాయిట్ పక్కకి జరిగినట్లు టాక్. మార్చి 19 పోతే ఇంకెప్పుడు డెకాయిట్ వస్తోంది అంటే ఏప్రిల్ 10న వచ్చే అవకాశం ఉంది అని అంటున్నారు. త్వరలోనే మేకర్స్ ఈ డేట్ ను అధికారికంగా అనౌన్స్ చేయనున్నారని టాక్. ఇక ఈ విషయం తెలియడంతో శేష్ మంచి నిర్ణయమే తీసుకున్నాడని అంటున్నారు. మరి ఇందులో నిజమెంత అనేది తెలియాలి.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.